


# విభారే
## తెలుగు దినపత్రిక
## VIBHARE TELUGU DAILY




PUBLISHED FROM KURNOOL | ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి | ఆదివారం 06-08-2023 | సంపుటి : 04 | సంచిక : 296 | పేజీలు : 8 | వెల : రూ 3-00

# టిటిడి ఛైర్మన్‌గా భూమన

### ఖరారు చేసిన సిఎం జగన్
### వైవి పదవీకాలం ముగియడంతో నిర్ణయం





అమరావతి,అగస్టు5: టీటీడీ ఛైర్మన్‌గా భూమన కరుణాకర్ రెడ్డి నియమితులయ్యారు. తిరుమల తిరుపతి దేవస్థానం ఛైర్మన్‌గా భూమనను సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఎంపిక చేశారు. ప్రస్తుతం టీటీడీ ఛైర్మన్ గా ఉన్న వైవీ సుబ్బారెడ్డి పూర్తి స్థాయిలో రాజకీయ వ్యవహారాలు చూడనున్నారని సమాచారం. ఈ నెల పదో తేదీతో రెండుసార్లు అంటే నాలుగేళ్ల పదవి కాలం పూర్తవుతుంది. తిరుపతి ఎమ్మెల్యే అయిన భూమన కరుణాకర్ రెడ్డి గతంలోనూ టీటీడీ ఛైర్మన్ గా చేసిన అనుభవం ఉంది. సీఎం జగన్ కుటుంబానికి అత్యంత సన్నిహితులైన భూమన కరుణాకర్ రెడ్డి.. వచ్చే ఎన్నికల్లో పోటీ చేయాలనుకోవడం లేదు. ఆయన కుమారుడికి టిక్కెట్ ఇవ్వాలని అధిష్టానాన్ని కోరుతున్నారు. టీటీడీ ఛైర్మన్‌గా చేసి రిటైర్ అవుతానని అవకాశం కల్పించాలని సీఎం జగన్‌ను కోరినట్లు తెలుస్తోంది. గతంలో భూమన ఓ సారి 2006 నుంచి 2008 మధ్య కాలంలో టీటీడీ ఛైర్మన్‌గా సేవలు అందించారు. తాజాగా చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, పల్నాడు జిల్లాకు చెందిన బీసీ వర్గానికి చెందిన జంగా కృష్ణమూర్తి, భూమన కరుణాకర్ రెడ్డి టీటీడీ ఛైర్మన్ రేసులో నిలిచారు. ఈ ముగ్గురిలో సీఎం జగన్ చివరికి తిరుపతి ఎమ్మెల్యే భూమనను ఎంపిక చేసి సస్పెన్స్‌కు తెరదించారు. ప్రస్తుత బోర్డు పదవి కాలం ఆగస్టు 10 తేదీతో ముగుస్తుంది. అనంతరం వైవీ సుబ్బారెడ్డి జాతీయ రాజకీయాల్లో బిజీగా మారనున్నారు. ఈ మేరకు వైసీపీ అధిష్టానం కార్యాచరణ రూపొందించినట్లు తెలుస్తోంది. టీటీడీ ఛైర్మన్ పోస్ట్ అంటే రాష్ట్ర మంత్రి పదవి కంటే ఎక్కువగా భావిస్తారు. అలాంటి పదవి కోసం ఎంత తీవ్ర ఒత్తిడి ఉంటుందో ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. గత ఎన్నికల్లో లోక్ సభ టిక్కెట్ నిరాకరించడంతో వైవీ సుబ్బారెడ్డిని బుజ్జగించడానికి అధికారంలోకి రాగానే సీఎం జగన్ ఆయనకు టీటీడీ ఛైర్మన్ పోస్టును ఇచ్చారు. తర్వాత సైతం పదవిని కొనసాగించారు. ఈ నెల పదో తేదీతో రెండు సార్లు అంటే టీటీడీ ఛైర్మన్ గా సుబ్బారెడ్డి నాలుగేళ్ల పదవి కాలం పూర్తవుతుంది. కొత్త టీటీడీ బోర్డును నియమించాల్సి ఉంది. దీంతో ఇప్పటి నుంచే ఆశావహులు ప్రయత్నాలు చేస్తున్నారు. అన్ని కీలక పదవులు ఒకే సామాజికవర్గానికి ఇస్తున్నారని కొంత కాలంగా టీడీపీతో పాటు జనసేన నేతలు విమర్శలు గుప్పిస్తున్నారు. వీటిని తిప్పికొట్టడానికి ఈ సారి టీటీడీ ఛైర్మన్ పోస్టును బీసీ వర్గాలకు ఇస్తారన్న ప్రచారం జరిగింది. పల్నాడు జిల్లాకు చెందిన బీసీ వర్గానికి చెందిన జంగా కృష్ణమూర్తికి అవకాశం దక్కుతుందనే ప్రచారం సాగుతోంది. జంగా వైసీపీ ఏర్పాటు నుంచి పార్టీలో క్రియాశీలకంగా వ్యవహరిస్తున్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లా పల్నాడు ప్రాంతానికి చెందిన బీసీ (యాదవ వర్గం)కు చెందిన నేత. పార్టీలోని బీసీ నేతలతోనూ సత్సంబంధాలు ఉన్నాయి. గతంలో ఎమ్మెల్యేగా, టీటీడీ బోర్డు సభ్యుడిగా పని చేసారు. ఎమ్మెల్సీగా ఉన్నారు. బీసీ సామాజిక వర్గానికి టీటీడీ ఛైర్మన్ ఇస్తారని ప్రచారం జరుగుతున్న సమయంలోనే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, భూమన కరుణాకర్ రెడ్డి రేసులోకి వచ్చారు. వైసీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి టీటీడీ బోర్డు సభ్యుడిగా చెవిరెడ్డి ఉన్నారు. తుడా ఛైర్మన్ హోదాలో ఎక్స్ అఫీషియో సభ్యుడిగా కొనసాగతున్నారు. వచ్చే ఎన్నికల్లో చెవిరెడ్డి, భూమన ఇద్దరూ బరిలోకి దిగడం లేదు.

# ఎస్టీల సంక్షేమానికి టిడిపి కృషి

### పాదయాత్రలో లంబాడా గిరిజనులతో భేటీ
### వారి సమస్యలను చర్చించిన లోకేశ్

పల్నాడు,అగస్టు5: ఎస్టీల సంక్షేమం, అభివృద్ధి చేసింది తెలుగుదేశం పార్టీ అని టీడీపీ యువనేత నారా లోకేశ్ తెలిపారు. చంద్రబాబు హయాంలో గిరిజన తండాల్లో రోడ్లు, తాగునీరు సౌకర్యాలు కల్పించారని తెలిపారు. జిల్లాలో పాదయాత్ర చేస్తున్న లోకేశ్ ఈపూరు మండలం బొమ్మరాజువల్లిలో లంబాడి వర్గీయులతో సమావేశమయ్యారు. లంబాడీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా యువనేత మాట్లాడుతూ.. ఎన్టీఆర్ హయాంలో ఐటీడీఏ ఏర్పాటు చేశారని.. టీడీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామాల్లో కూడా ఇంటింటికి ఉచితంగా తాగునీరు అందించామన్నారు. వరికెపుడిసెల ప్రాజెక్టు వైసీపీ ప్రభుత్వం గాలికి వదిలేసిందని మండిపడ్డారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన మూడేళ్లలో వరికెపుడిసెల పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. టీడీపీ అధికారంలోకి వచ్చాక ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేస్తామన్నారు. ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయకపోవడంతో అటు నిరుద్యోగులు, ఇటు విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని యువనేత తెలిపారు. వైసీపీ పాలనలో బెస్ట్ అవైలబుల్ స్కూల్ పథకం ఎత్తివేయటంతో గిరిజనులు ఇబ్బంది పడుతున్నారన్నారు. నిత్యావసరాల ధరలు, గ్యాస్ ధరలు విపరీతంగా పెరిగాయని లంబాడి మహిళలు లోకేశ్ దృష్టికి తీసుకొచ్చారు. టీడీపీఅధికారంలోకి వచ్చాక మహాశక్తి పథకం ద్వారా



మహిళలకు ఆర్థిక సాయం అందజేస్తామన్నారను. ఏడాదికి ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్లు ఇవ్వబోతున్నామన్నారు. వైసీపీ ప్రభుత్వం అమ్మఒడి పథకం ఇంట్లో ఒక్కరికే ఇస్తోందని.. టీడీపీ అధికారంలోకి వచ్చాక ఒక్కో విద్యార్థికి రూ. 15 వేలు ఇస్తామని తెలిపారు. జగన్ ప్రభుత్వంలో ఫీజు రీఎంబర్స్‌మెంట్ ఆపివేయటంతో

రెండున్నర లక్షల మంది విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారన్నారు. విద్యార్థులు చదువుకునే సమయంలోనే నైపుణ్యాలు నేర్పించేలా విద్యా ప్రణాళికలో మార్పులు చేపడతామన్నారు. కోర్సు పూర్తైే బయటకు రాగానే ఉద్యోగం వచ్చేలా చేస్తామన్నారు. పరిశ్రమలు ఏర్పాటు చేసి ఉద్యోగ అవకాశాలు మెరుగు పరుస్తామన్నారు. జగన్ అధికారంలోకి వచ్చిన తర్వాత గిరిజనులకు సంబంధించి 16 సంక్షేమ పథకాలు రద్దు చేశారన్నారు. గిరిజన తండాలను పంచాయతీలుగా మారుస్తామని జగన్ హామీ ఇచ్చి మాట తప్పారని లోకేశ్ మండిపడ్డారు.

# బాబు కనుసన్నల్లోనే పుంగనూరు ఘటన: బొత్స

అమరావతి,అగస్టు5: పుంగనూరు ఘటన తెలుగుదేశం అధినేత చంద్రబాబునాయుడు కనుసన్నల్లోనే జరిగిందని మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. పుంగనూరు ఘటనను ఖండించారు. శనివారం మంత్రి బోత్స మీడియాతో మాట్లాడుతూ.. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఆయన అనుచరులు రెచ్చగొడితే నీ బుద్ధి ఏమైందని చంద్రబాబుని ప్రశ్నించారు. ఎస్పీజీ రక్షణ కలిగిన నేత ఎటు వెళ్తున్నారో ముందుగా చెప్పాల్సిన అవసరం లేదా? అని నిలదీశారు. పుంగనూరు ఘటనకు చంద్రబాబు బాధ్యత వహించాలన్నారు. పుంగనూరు ఘటనకు కారణమైన చంద్రబాబుపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు.

# విశాఖ ఎంపిగా గెలిస్తే దుబాయ్‌గా చేస్తా

### ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కెఎ పాల్

విశాఖపట్నం,అగస్టు5: విశాఖ ఎంపీగా పోటీ చేస్తున్నాను..గెలిస్తే విశాఖను దుబాయ్, సింగపూర్‌లా మారుస్తానని ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏపాల్‌అన్నారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కేంద్రం విశాఖ స్టీల్ ఎ÷-లాంట్ అమ్ముతుంటే.. జగన్, పవన్, బాబు అడ్డుకోలేదని మండిపడ్డారు.ఏపీ(ంఖ)ని చంద్రబాబు సర్వనాశనం చేశారన్నారు. పవన్ కళ్యాణ్ ప్యాకేజీ స్టార్ అని ఎద్దేవా చేశారు. ప్రతి ఇంటా...ప్రతి గుండెల్లో పాల్ ఉంటారని చెప్పారు.తెలంగాణ ఎన్నికలో పోటీ చేస్తాం..సీఎం అయితే ప్రతి నియోజకవర్గానికి హెలికాప్టర్, ఆసుపత్రి కడతానని అన్నారు.ఏడాదికి 10 లక్షల ఉద్యోగాలు ఇస్తానని, వయస్సులో చిన్న కాబట్టి.. పవన్‌ని తమ్ముడు అంటానని చెప్పారు.ముఖ్యమంత్రిగా జగన్ ఫెయిల్ అయ్యారు..జగన్ పార్టీకి 175 స్థానాలు కాదు...పట్టుమని 25 కూడా సీట్లు రావని జోస్యం చెప్పారు.పవన్ వారాహి యాత్ర కాదు..మోదీ యాత్ర, నారాహి యాత్ర..ఈ యాత్రలు పవన్ రద్దు వేసుకోవాలని హితవు పలికారు.ఇదిలావుంటే ప్రజాశాంతి పార్టీ కార్యాలయం వద్ద టీడీపీ నేతలు, టీఎన్ఎస్ఎఫ్ ఆందోళనలతో ఉద్రిక్తత చోటు చేసుకుంది. శనివారం పార్టీ కార్యాలయంలో కేఏ పాల్ విలేకరుల సమావేశం నిర్వహిస్తున్న సమయంలో పాల్‌కు వ్యతిరేకంగా టీఎన్ఎస్ఎఫ్, టీడీపీ నేతల నిరసనకు దిగారు. పాల్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కేఏ పాల్ డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. టీడీపీని, చంద్రబాబు, లోకేశ్‌ను కించపరిచేలాగా ఫ్లెక్సీని ఏర్పాటు చేయడంపై ఆ పార్టీ నేతలు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఫ్లెక్సీలో పవన్ కళ్యాణ్‌ను కూడా అవమానపరిచారంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ఇటువంటి ఫ్లెక్సీ ముందు ప్రెస్‌మీట్ పెట్టడం ఏంటి అని టీడీపీ నేతలు మండిపడుతున్నారు. పాల్ మతిస్థిమితం కోల్పోయారని విమర్శలు గుప్పించారు. తక్షణమే కేఏ పాల్ క్షమాపణ చెప్పాలని లేదంటే ఊరుకునే ప్రసక్తే లేదని టీడీపీ నేతలు హెచ్చరించారు.



# మణిపూర్‌లో మళ్లీ హింసాకాండ


### కాల్పుల్లో ముగ్గురు వ్యక్తుల దుర్మరణం
### ఉగ్రవాదుల పనిగా అనుమానం



ఇంఫాల్,ఆగస్ట్5: మణిపూర్‌లో మళ్లీ హింసాకాండ చెలరేగింది. బిష్ణుపూర్ జిల్లా, క్వాక్టా పట్టణంలో శుక్రవారం రాత్రి జరిగిన కాల్పుల్లో ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు. వీరిలో ఇద్దరు తండ్రీకొడుకులు ఉన్నారు. ఈ తండ్రీకొడుకులిద్దరినీ ఉగ్రవాదులు కాల్చి చంపేసి, ఆ తర్వాత వారి మృతదేహాలను కత్తులతో ముక్కలు చేశారు. దీంతో మణిపూర్‌లో గత కొన్ని నెలలుగా హింస కొనసాగుతూనే ఉంది. తాజాగా శనివారం ఉదయం బిష్ణుపూర్ జిల్లాలో ఉగ్రవాదులు జరిపిన దాడుల్లో ముగ్గురు మృతి చెందారని పోలీసు అధికారులు వెల్లడించారు. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మణిపూర్‌లోని బిష్ణుపూర్ జిల్లాలోని క్వాక్తా సమీపంలోని ఉఖ్హా తంపఖ్ గ్రామంలో శనివారం తెల్లవారుజామున 2 గంటల సమయంలో ఉగ్రవాదులు దాడులు జరిపారు. ఈ దాడుల్లో ఉగ్రవాదులు తండ్రీకొడుకులిద్దరు, మరో వ్యక్తిని దారుణంగా హత్య చేసి చంపారని పోలీసులు శనివారం తెలిపారు. హత్యకు గురైన గ్రామస్తులు నిద్రిస్తున్న సమయంలో ఉగ్రవాదులు విచక్షణారహితంగా కాల్పులు జరిపి, కత్తులతో పొడిచి చంపారని పోలీసులు తెలిపారు. దాడి చేసిన ఉగ్రవాదులు చరచంద్‌పూర్ నుండి వచ్చినట్లు పోలీసులు పేర్కొన్నారు. కొండలు, లోయల మధ్య, కేంద్ర భద్రతా బలగాలు నిర్వహించబడుతున్న బఫర్‌జోన్‌ను ఉగ్రవాదులు ఉల్లంఘించి.. దాడి చేశారని, ఈ ఘటన తీవ్ర ఆందోళన కలిగించిందని పోలీసులు వర్గాలు తెలిపాయి. అత్యంత బాధాకరమైన మరో విషయం ఏమిటంటే, మృతులు ముగ్గురూ శుక్రవారం వరకు సహాయక శిబిరాల్లోనే ఉండేవారు. పరిస్థితి మెరుగుపడిందనే ఉద్దేశంతో వీరు శుక్రవారమే క్వాక్టా పట్టణంలోని తమ నివాసాలకు వెళ్లారు.

# ప్రశ్నిస్తే నా రక్తం కళ్ల చూడాలనుకుంటారా?: చంద్రబాబు

రేణిగుంట: రాష్ట్రంలో వైకాపా అరాచకాలు పరాకాష్ఠకు చేరాయని తెదేపా అధినేత చంద్రబాబు ధ్వజమెత్తారు. అందుకే ప్రజల్లో ఓపిక నశించి తిరుగుబాటు మొదలైందన్నారు.రాయలసీమలో నీరు పారించాలని తాము చూస్తుంటే.. రక్తం పారించాలని వైకాపా నాయకులు చూస్తున్నారని మండిపడ్డారు. వైకాపా పాలకుల ఉచ్చులో పడి వ్యవస్థకు చెడ్డపేరు తీసుకురావొద్దని పోలీసులకు చంద్రబాబు సూచించారు.చిత్తూరు జిల్లాలో 4,300 చెరువులు, వాటికింద సుమారు 47వేల ఎకరాల సాగు భూమికి అవకాశం ఉంటే.. వైకాపా ప్రభుత్వం చెరువుల అభివృద్ధిని విస్మరించిందని చంద్రబాబు విమర్శించారు. సాగునీటి ప్రాజెక్టుల విధ్వంసంపై యుద్ధభేరి కార్యక్రమంలో భాగంగా ఆయన తిరుపతి జిల్లా రేణిగుంటలో పర్యటించారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టుల పరిస్థితిపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. జిల్లా వ్యాప్తంగా 1,147 ఎకరాల్లో చెరువులు ఆక్రమణ జరిగిందని ఆరోపించారు. 75 ఎకరాల చెరువు విస్తీర్ణం పూడ్చి మరీ కబ్జా చేశారని విమర్శించారు.జగన్ అధికారంలోకి వచ్చాక చిత్తూరులో 25 ప్రాజెక్టులు ప్రీక్లోజర్ చేశారని మండిపడ్డారు. గాలేరు నగరి సుజల స్రవంతి ప్రాజెక్టులో నీళ్లంటూ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి భారీ అవినీతికి తెరలేపారని దుయ్యబట్టారు. వైకాపా పాలనలో సీఎం తర్వాత అత్యధిక దోపిడీకి పాల్పడింది పెద్దిరెడ్డే అని చెప్పారు. ఈ నాలుగేళ్లలో శ్రీబాలాజీ రిజర్వాయర్, వేణుగోపాలసాగర్ రిజర్వాయర్‌లో తట్టెడు మట్టి కూడా ఎత్తలేదని విమర్శించారు. కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించక ఎక్కడి పనులు అక్కడే ఆగిపోయాయన్నారు. జీవోలతో సహా చూపిస్తే నాపై దాడికి పాల్పడుతున్నారు.. ప్రశ్నిస్తే నా రక్తం కళ్ల చూడాలనుకుంటారా? అని చంద్రబాబు మండిపడ్డారు.



# ప్రజాస్వామ్యం అపహాస్యం

### వైసిపి దాడులపై మండిపడ్డ అచ్చన్న

అమరావతి,ఆగస్ట్5: ప్రజాస్వామ్యాన్ని ఏపీ సీఎం జగన్మోహన్ రెడ్డి అపహాస్యం చేస్తున్నారని టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు అచ్చెన్నాయుడు విరుచుకుపడ్డారు. శనివారం మీడియాతో మాట్లాడుతూ... వైసీపీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రశ్నిస్తే దాడులు, హత్యలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. నిన్న పుంగునూరులో చంద్రబాబుపై రాళ్లదాడి చేశారని.. నేడు పల్నాడులో టీడీపీ సానుభూతిపరుడు కోటయ్యపై వైసీపీ నేత కృష్ణమూర్తి దాడి చేసి తలపగలకొట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసులకు ఫిర్యాదు చేసినందుకు కోటయ్యపై వైసీపీ గూండాలు రెండోసారి దాడికి తెగబడ్డారన్నారు. కేసు నమోదు చేయకుండా వైసీపీ నేతలకు పోలీసులు కాపుగాస్తున్నారని ఆరోపించారు.

# సంపాదకీయం

ఆదివారం 06-08-2023

## ఓట్ల కోసం దుబారా పథకాలు!

ఉభయ తెలుగు రాష్ట్రాల్లో అమలవుతున్న అనేకానేక ఉచిత కార్యక్రమాల ద్వారా ఒక్కో కుటుంబానికి అంతోఇంతో మేలుజరుగుతోంది. ఓ రకంగా చెప్పాలంటే మీరు ఓట్లేయాల్సిందే..మేము మీకు ఫలాలనా మేళ్లు చేస్తున్నామన్న రీతిలో పోటీపడి పథకాలను వరదలా పారిస్తున్నారు. ప్రజలు చెమటోడ్చి కడుతున్న డబ్బులు పందేరం చేస్తున్నారు. ఎపిలో సిఎం జగన్ బటన్ నొక్కితే..కెసిఆర్ బటన్ నొక్కకుండానే పంచుతున్నారు. ఇందులో అనేక పథకాలు ఉన్నాయి. దీంతో ఖజానా ఎప్పుడో ఖాళీ అయ్యింది. అప్పులు భూతంలా వెంటాడుతున్నాయి. ఇదేమిటని అడిగితే ..అప్పులు చేయకుంటే ఎలా అని పాలకులు ఎదురుదాడి చేస్తున్నారు. అప్పులతో ఆస్తులు సృష్టిస్తున్నామని, పేదల కడుపు నింపుతున్నామని ఘనంగా చెప్పుకుంటున్నారు. సబ్సిడీ పథకాలకు ప్రజలను అలవాటు చేసి వారిని నిర్వీర్యులుగా చేయడంలో ప్రభుత్వాలు పోటీ పడుతున్నాయి. ప్రస్తుతం గ్రామాల్లో కూలీలు దొరకడం కష్టంగా మారింది. వ్యవసాయ కూలీల సంగతి చెప్పనక్కర్లేదు. జిఎస్టీతో ఆదాయం పెరిగిందని చంకలు గుద్దుకుంటున్న కేంద్రం కూడా దుబారా ఖర్చులు మాత్రం తగ్గించుకోవడం లేదు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నిర్వాకం వల్ల పన్నులు కట్టలేక మధ్యతరగతి ప్రజల నడ్డి విరుగుతోంది. పన్నులు కట్టే ప్రజలకు జవాబుదారీ లేకుండా పోతోంది. ధరల విషయంలో పల్లెలకు పట్టణాలకు తేడా లేకుండా పోయింది. కూలీనాలీ చేసుకునే వారు కిక్కులేనిదే ఉండడం లేదు. దీంతో సంపాదించిన దాంట్లో అధిక భాగం తాగడానికే తగలేస్తున్నారు. ఉపాధిహామీ కింద నిర్మాణాత్మక పనులు చేయించాలన్న డిమాండ్‌పై కేంద్రం నిర్ణయాలు తీసుకోవడం లేదు. వ్యవసాయానికి అనుసంధానం చేయాలన్న వినతులను పక్కన పెట్టింది. ఉపాధి హామీకింద ఏటా వేలాది కోట్లు ఖర్చు చేస్తున్నా ..పనికి తగ్గట్లుగా చేసిన పనులు జరగడం లేదు. దీనిని సమీక్షించాలన్న కనీస పరిజ్ఞానం కూడా ప్రభుత్వానికి కలగడం లేదు. దీంతో గ్రామాల్లో వ్యవసాయ కూలీలు కరువయ్యారు. 132 కోట్ల జనాభా ఉన్న భారత దేశంలో కూలీలు ఎందుకు దొరకడం లేదన్న విషయం ప్రపంచాన్ని సైతం ఆందోళనకు గురి చేస్తోంది. దీన్ని ఎలా అధిగమించాలో ఆలోచన చేయడం లేదు. ఇలాంటి పరిస్థితుల్లో ఇంకా రూపాయికే కిలో బియ్యం పథకాన్ని కొనసాగించడం సబబుకాదని గుర్తించడం లేదు. రూపాయి బియ్యం తినేవారు ఇప్పుడు రాష్ట్రాల్లో లేరు. ఈ పథకాన్ని పునః సమీక్షించడం వల్ల వేలకోట్ల రూపాయల వృధాను అడ్డు కోవచ్చు. అయినా సమీక్షించడంలో తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు సాహసించడం లేదు. రూపాయికి కొత్తతిమీర కట్ట కూడా రాని రోజుల్లోఈ పథకం కోసం వేలకోట్లు ప్రజల ధనాన్ని దుబారా చేస్తున్నారు. ఈ బియ్యం పథకం ప్రభుత్వాలకు గుదిబండగా మారినా ఓటు బ్యాంక్ కోసం దీని జోలికి వెళ్లడం లేదు. ఓట్లతో ముడిపడి ఉన్న ఈ పథకాన్ని తొలగించాల్సిందే. తెలుగు రాష్ట్రాల ఖజానాపై తీవ్ర ప్రభావం చూపుతున్న కిలో రూపాయి బియ్యాన్ని తక్షణం తొలగించడం ద్వారా ప్రజల సొమ్ముకు రక్షణగా నిలవాలి. బహిరంగ మార్కెట్‌లో కిలో 60 రూపాయల బియ్యం అమ్ముతున్నారు. ఇంత వ్యత్యాసంతో బియ్యం అందిస్తున్నా పేదలు ఈ బియ్యాన్ని అమ్ముకోవడం ద్వారా వ్యాపారాం చేస్తున్నారు. ఆర్థిక మాంద్యంతో అతలాకుతలం అవుతున్న ప్రస్తుత తరుణంలో ఈ పథకంపై సమీక్షించి అక్రమాలను అరికట్టాలి. కొందరికి ఈ పథకం వరంగా మారింది. బియ్యాన్ని హోళ్లకు అమ్ముకుంటున్న ఘటనలు కూడా ఉన్నాయి. మరోవైపు కిలో రూపాయికే ఇస్తున్న చౌక బియ్యం అక్రమంగా రాష్ట్రాల సరిహద్దులు దాటుతున్నాయి. పేదలు కడుపునిండా తినాలన్న ఈ పథకం ఇప్పుడు కొందరికి వ్యాపారంగా మారింది. మరికొందరికి ఆదాయ వనరుగా మారింది. అలాగే రీసైక్లింగ్ పేరుతో సన్నబియ్యంగా మార్చి అమ్ముకునే వ్యాపారంగా మారింది. చెక్‌పోస్టులు,తనిఖీ కేంద్రాలు, పోలీసులు ఉన్నా బియ్యం రవాణాను అడ్డుకోలేకపోతున్నారు. ఎవరి స్థాయిలో వారికి మామూళ్లు అందుతుండటంతో వ్యాపారం జోరుగా సాగుతోందన్నది కఠోర సత్యం. ఫలితంగా పేదలపేరుతో సర్కార్ అందచేస్తున్న బియ్యం అక్రమార్కులకు వ్యాపారంగా మారింది. ఇక కొందరు ఈ బియ్యాన్ని అమ్ముకుని సన్నబియయం కొనుక్కుని తింటున్నారు. చాలామంది తెల్ల రేషన్ కార్డుదారులు ఈ బియ్యాన్ని అమ్ముకోవడానకే ఇష్టపడుతున్నారు. అందుకే బియ్యం కార్డుఉల కావాలని ఆందోళనలు చేస్తున్నారు. ఇలా రెండు తెలుగు రాష్ట్రాల్లో ఈ పథకం అమలు సంగతి ఎలా ఉన్నా లక్ష్యం మాత్రం నీరుగారుతోంది. తద్వారా ప్రజలు పన్నుల రూపంలో కడుతున్న నిధులు వృధా అవుతున్నాయి. బియ్యం పథకం కోసం సబ్సిడీ రూపంలో వేలకోట్లతో పాటు పెద్ద యంత్రాంగం పనిచేయాల్సి వస్తోంది. ఇలాంటి దుబారాను అరికట్టి నిజమైన పేదలకు లబ్ది చేకూర్చేలా కార్యాచరణ చేయాలి. బియ్యం పథకాన్ని ఎత్తేసే ఆలోచన చేస్తే మంచిది. రూపాయికి విలువ లేని సమయంలో కిలో బియ్యాన్ని అందచేసి అక్రమాలకు తావీయకుండా దీనిని ఎప్పుడో తొలగించాల్సింది. రైతు బజార్లను పటిష్టం చేసి అక్కడే అన్ని సరకులను తక్కువ ధరలకు అమ్మితే పేద, మధ్య తరగతి ప్రజలకు మేలు చేసినవారం అవుతాం. అంతేగాని రూపాయికే బియ్యం ఇచ్చి వృధాను ప్రోత్సహించడం ప్రభుత్వాలకు మంచిది కాదు. ఉమ్మడి ఎపిలో సబ్సిడీ బియ్యం ధరను పెంచినందుకు అప్పట్లో సిఎంగా ఉన్న చంద్రబాబుపై విమర్శలు చేశారు. ఆరోజుల్లోనే ఆయన దీనిని ఐదు రూపాయలకు పెంచారు. కానీ ఇప్పుడు రూపాయికే బియ్యం కావడంతో అక్రమ వ్యాపారానికి తెరతీసారు. దీంతో రాష్ట్ర ప్రభుత్వాలకు బియ్యం సేకరణ తలకు మించిన భారంగా మారింది. జాతీయ భద్రత చట్టం కింద కొంత కేంద్రం సబ్సిడీ బియ్యాన్ని అందిస్తోంది. మిగిలిన లక్షల కార్డులకు పంపిణీ చేస్తున్న బియ్యానికి రాష్ట్ర ప్రభుత్వమే సబ్సిడీ భరించాల్సి వస్తోంది. దీంతో రాష్ట్ర ప్రభుత్వాలపై అదనపు భారం పడుతోంది. ఇదంతా ప్రజలు పన్నుల రూపంలో కడుతున్న సొమ్ము అని పాలకులు గుర్తించాలి.

# తృణధాన్యాలను ఆహారం ఇవ్వాలి

**రేషన్ షాపుల్లో అమ్మకాలు చేపట్టాలి**
**పలువురు రైతుల సూచన**



సంగారెడ్డి,ఆగస్ట్5 : సేంద్రియ పద్దతిలో తృణధాన్యాలను ఉత్పత్తి చేయడంలో ఉమ్మడి మెదక్ జిల్లాలో డక్కన్ డెవలప్‌మెంట్ సొసైటీ చేస్తున్న కృషి సర్వత్రా ప్రశంసలు అందుకుంటోంది. దీనిని ఇతర ప్రాంతాలకు కూడా విస్తరించడం ద్వారా వ్యవసాయంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టవచ్చు. ఈ సొసైటీ ఇచ్చిన సూచనలు పాటించి వ్యవసాయం చేస్తున్న కారణంగా రైతులు లాభాల బాటపడుతున్నారు. అయితే వీరు పండించే పంటలు ప్రజలకు ఎంతో ఆవసరం. ఈ దశలో రేషన్ షాపుల్లో తృణధాన్యాలు అందుబాటులోకి తీసుకుని రావాలని రైతులు కోరుతున్నారు. ఆరోగ్యానికి తృణధాన్యాలు మంచివి. ఇలాంటి పంటలను ప్రోత్సహించి ప్రజలకు అందుబాటులోకి తేవాల్సి ఉంది. ప్రధానంగా హాస్టళ్లలో విద్యార్థులకు తృణధాన్యాలతో చేసిన పదార్థాలను అందిస్తే బాలలు ధృడంగా అవుతారని వైద్యులు అంటున్నారు. ఇకపోతే గిరిజనులు ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో చౌక ధరల దుకాణాల ద్వారా జొన్నలు పంపిణీ చేసేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. అలాగే, అంగన్‌వాడీ కేంద్రాల్లోని పిల్లలకు చిరు, తృణ ధాన్యాల ఆహారాన్ని అందించాలని నిర్ణయించింది. ఈ మేరకు సాధ్యాసాధ్యాలను అంచనా వేసేందుకు పైలట్ ప్రాజెక్టును చేపట్టింది. వికారాబాద్ జిల్లాలోని రేషన్ షాపుల ద్వారా సబ్సిడీపై జొన్నలు ఇచ్చే కార్యక్రమాన్ని ఇప్పటికే అమలు చేస్తున్నారు. ఎంపిక చేసిన గ్రామాల్లో కుటుంబానికి 8 కిలోల చొప్పున జొన్నలను సబ్సిడీపై పంపిణీ చేస్తున్నారు. గతంలో జొన్నలు, మక్కలు, గోధుమలు చౌక దుకాణాల్లో దొరికేవి కానీ సబ్సిడీ బియ్యం పథకం వచ్చాక వీటిని వక్కన పెట్టారు. జిల్లా వ్యాప్తంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో తృణ ధాన్య ఆహారం అందించేందుకు ప్రతిపాదనలు రూపొందించాల్సి ఉంది. జిల్లాలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో వీటిని అందుబాటులోకి తీసుకుని రావాలి. గిరిజన జనాభా ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో రేషన్ షాపుల ద్వారా జొన్నలు పంపిణీ చేసే విషయాన్ని పరిశీలించాలి. పైలట్ ప్రాజెక్టులో భాగంగా అంగన్ వాడీ కేంద్రాల్లోనూ చిరు,

తృణ ధాన్యాలను పంపిణీ చేస్తే బాగుంటందన్న అభిప్రాయం వ్స్తోంది. అంగన్ వాడీ కేంద్రాలలోని పిల్లలకు చిరు, తృణ ధాన్యాల ఆహారాన్ని అందించడం ద్వారా ఆరోగ్యాన్ని అందించవచ్చు. రాష్ట్రమంతటా అమలు చేయాలని మహిళా శిశు సంక్షేమ శాఖను కోరుతున్నారు. అయితే చిరు, తృణ ధాన్యాలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సబ్సిడీని భరించే పరిస్థితి లేదు. పైగా వీటిని అన్ని జిల్లాల్లో తీసుకునే అవకాశం కూడా లేదు. గిరిజన జనాభా ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో దీన్ని అమలు చేస్తే మంచి ఫలితాలు రావచ్చు. రైతులను ప్రోత్సహిస్తే సంప్రదాయంగా తృణ ధాన్యాలను పండించడమే కాకుండా ఎక్కువగా వినియోగిస్తారు.

# కంప్యూటర్లు, ట్యాబ్‌ల దిగుమతిపై ఊరట

**నిషేధాన్ని అక్టోబర్ 31 వరకు పొడగించిన కేంద్రం**

న్యూఢిల్లీ,ఆగస్ట్5 : ల్యాప్‌టాప్‌లు, ట్యాబ్లెట్ పీసీలు, పర్సనల్ కంప్యూటర్ల దిగుమతులపై ఆంక్షలను ఆకోట్బర్ నెలాఖరు వరకు సడలించారు. ఈ ఏడాది అక్టోబర్ 31 వరకు వీటి దిగుమతులపై నిషేధం ఎత్తేశారు. గురువారం నాడు హఠాత్తుగా, తక్షణం అమల్లోకి వచ్చేలా బ్యాన్ విధించి భయపెట్టిన కేంద్ర ప్రభుత్వం, తక్షణమే కొంత రిలీఫ్ ప్రకటించింది. కోడ్ 8471 కిందకు వచ్చే ల్యాప్‌టాప్‌లు, ట్యాబ్లెట్ పీసీలు, పర్సనల్ కంప్యూటర్ల ఇంపోర్ట్స్‌పై విధించిన నిషేధాన్ని మరో 3 నెలల పాటు పక్కనపెట్టింది. ఈ ఏడాది నవంబర్ 1వ తేదీ నుంచి బ్యాన్ అమలవుతుందని ప్రకటించింది. దీంతో యథావిధిగా దిగుమతులకు అవకాశం ఏర్పడింది. హార్మోనైజ్డ్ సిస్టమ్ ఆఫ్ నమెన్‌క్లేచర్' కోడ్ అంటే, పన్ను ప్రయోజనాల కోసం ప్రొడక్ట్స్‌ను గుర్తించడానికి ఉపయోగించే వర్గీకరణ వ్యవస్థ. డేటా ప్రాసెసింగ్ మెషీన్లు కోడ్ 8471 కిందకు వస్తాయి. డేటా ప్రాసెసింగ్ పనులను నిర్వహించేందుకు రూపొందించిన డివైజ్‌లను గుర్తించడానికి ఈ కోడ్‌ను ఉపయోగిస్తారు. ఈ కోడ్ కిందకు వచ్చే డివైజ్‌ల మీద ఇమ్మీడియట్ ఎఫెక్ట్‌తో విధించిన బ్యాన్ కారణంగా అతి పెద్ద హార్డ్‌వేర్ కంపెనీల సప్లై చైన్స్‌లో గందరగోళం ఏర్పడింది. వాటి కన్‌సైన్‌మెంట్స్ కస్టమ్స్ దగ్గర నిలిచిపోయాయి. ఆ కంపెనీల ఆఫీసుల నుంచి డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్ ఆఫీసుకు రోజంతా ఫోన్ల మీద ఫోన్లు, మెసేజ్‌లు వచ్చాయి. విదేశాలకు తాము ఆర్డర్ పెట్టిన ల్యాప్‌టాప్‌లు, ట్యాబ్లెట్ పీసీలు, పర్సనల్ కంప్యూటర్లు డెలివరీ దశలో ఉన్నాయని, హఠాత్తుగా బ్యాన్ విధిస్తే ఆ కన్‌సైన్‌మెంట్స్ ఏం కావాలంటూ బాడా కంపెనీలు ప్రశ్నల వర్షం కురిపించాయి. తమ ఆర్డర్ల ప్రకారం ల్యాప్‌టాప్‌లు, ట్యాబ్లెట్ పీసీలు, పర్సనల్ కంప్యూటర్లను ఫారిన్ ఫ్యాక్టరీల్లో ఉత్పత్తి చేస్తున్నారని, వాటి సంగతేంటని కూడా అడిగాయి. అందులోనూ, దేశంలో పండుగల సీజన్‌కు ముందు ఇలాంటి నిర్ణయం తీసుకుంటే తాము బిజినెస్ ఎలా చేస్తామని అడిగాయి. ఇప్పటికే పెట్టిన ఆర్డర్లు, డెలివరీ దశలో ఉన్న వస్తువులను తాము తీసుకునే వరకు వెసులుబాటు ఇవ్వాలని అడిగాయి. దీంతోపాటు, ఆయా డివైజ్‌లను దిగుమతి చేసుకోవడానికి 'చెల్లుబాటు అయ్యే లైసెన్స్' పొందడానికి మరో మూడు నెలల టైమ్ ఇవ్వాలని రిక్వెస్ట్ చేశాయి. దిగుమతులపై అనిశ్చితి కారణంగా యాపిల్, శాంసంగ్ వంటి కంపెనీలు వాటి ప్రొడక్ట్స్ పంపడాన్ని తక్షణం ఆపేస్తాయి. ఈ క్రమంలో హార్డ్‌వేర్ ఇండస్ట్రీకి మూడు నెలల ఉపశమనాన్ని ప్రకటించింది. నోటిఫికేషన్ ప్రకారం... నవంబర్ 1 నుంచి ల్యాప్‌టాప్‌లు, పర్సనల్ కంప్యూటర్లు, టాబ్లెట్స్ దిగుమతులు 'ఆంక్షలు' కొనసాగుతాయి. అయితే కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం రాజకీయంగానూ దుమారం రేపింది. ఇది 'లైసెన్స్ రాజ్' అంటూ విమర్శలు వినిపించాయి. తన నిర్ణయాన్ని సెంట్రల్ గవర్నమెంట్ సమర్థించుకుంది. 'దేశంలో ట్రస్టెడ్ హార్డ్‌వేర్, సిస్టమ్స్ అందుబాటులో ఉండేలా చూడడం, దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించడం, ఆ ప్రొడక్ట్స్ దేశీయ తయారీని పెంచడం ప్రభుత్వ లక్ష్యం' అని ఐటీ శాఖ సహాయ మంత్రి రాజీవ్ చంద్రశేఖర్ ట్వీట్ చేశారు. దేశంలో సైబర్ సెక్యూరిటీ వ్యవస్థను బలోపేతం చేయడానికే లైసెన్సింగ్ విధానాన్ని తప్పనిసరి చేస్తున్నట్లు ప్రభుత్వంలోని కొందరు చెబుతున్నారు.

# ఎపి సర్పంచుల ఆందోళన

**ఢిల్లీ జంతర్‌మంతర్ వద్ద ధర్నా**
**మద్దతు తెలిపిప ఎంపి రఘురామ**

న్యూఢిల్లీ,ఆగస్ట్5 దేశరాజధాని ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ ఛాంబర్, ఆంధ్రప్రదేశ్ సర్పంచుల సంఘం ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. వీరి నిరసనకు ఎంపీ రఘురామ కృష్ణరాజు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ... పంచాయతీరాజ్ వ్యవస్థను వెన్ను విరిచే పనిలో జగన్మోహన్ రెడ్డి ఉన్నారని విమర్శిం చారు. కరెంట్ బిల్లుల పేరుతో పంచాయతీ నిధులను లాక్కున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో దురదృష్టవ శాత్తు తమ పార్టీకే 70? సర్పంచులు విజయం సాధించారన్నారు. ఇప్పుడు వారి గొంతులు సహితం ప్రభుత్వం కోస్తోందని తెలిపారు. వైసీపీ పార్టీలో నెగ్గిన సర్పంచులు కూడా ఇప్పుడు ఇబ్బందులు ఎదుర్కొక తప్పడం లేదన్నారు. పంచాయతీలో పనులు చేసిన సర్పంచ్లు ఎవరికి కూడా నిధులు రావడం లేదన్నారు. పంచాయితీ రాజ్ నిధులు దాదాపు రూ.8629 కోట్లను ప్రభుత్వం దోచేసిందని మండిపడ్డారు. పంచాయతీ వ్యవస్థలను నిర్వీర్యం చేసే విధంగా వలంటీరీ వ్యవస్థను తీసుకొచ్చారన్నారు. ప్రతిరోజు ఏదో ఒక సందర్భంలో వలంటీరీల దాడులు జరుగుతూనే ఉన్నాయని తెలిపారు. సర్పంచ్ అనే పదానికి విలువ లేకుండా వలంటీరీ అనే వ్యవస్థను జగన్ తీసుకొచ్చారని విమర్శించారు. పార్టీలకు అతీతంగా ప్రభుత్వంపై తిరగబడే రోజులు దగ్గరలో ఉన్నాయన్నారు. పుంగనూరులో చంద్రబాబు నాయుడపై చేసిన దాడి క్లియర్‌గా కనిపిస్తోంద న్నారు. కనీసం పోలీసులు ఘర్షణను ఆపే ప్రయత్నం కూడా చేయలేదని రఘు రామకృష్ణ ఆగ్రహం వ్యక్తం చేశారు.

## గవర్నర్ లేని సమయంలో రాజకీయమా

**ప్రభుత్వ తీరుపై మండిపడ్డ ఈటెల**
**అసెంబ్లీలో ప్రభుత్వం చిత్తశుద్దిగా లేదు: ఈటెల**

హైదరాబాద్,అగస్టు5:ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడానికి బీజేపీ వ్యతిరేకం కాదని ఆ పార్టీ ఎమ్మెల్యే ఈటెల రాజేందర్ అన్నారు. ప్రభుత్వ ప్రచారాన్ని ఖండిస్తున్నామని తెలిపారు. ఆర్టీసీ విలీనం బిల్లుపై బీజేపీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ స్పందించారు. శనివారం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద మాట్లాడుతూ... గవర్నర్ లేని సమయంలో బిల్లు పంపి ఆమోదించడం లేదని ఆరోపిస్తున్నారని మండిపడ్డారు. బట్ట కాల్చి మీద వేస్తున్నారన్నారు. ఆర్టీసీ కార్మికులకు రెండు పీఆర్సీలు ఇవ్వలేదని తెలిపారు.

# ఆర్డీఎస్ కుడి కాలువ ప్రాజెక్టు పూర్తి చేయాలి




పెద్దకడబూరు ఆగష్టు05 : ౧టవిభారె న్యూస్)పెద్దకడబూరు మండలంలోని తహశీల్దారు ఆఫీసు ముందు దర్నా ఆర్డీఎస్ కుడి కాలువ పనులు పూర్తి చేయాలని సిపిఐ ఆధ్వర్యంలో ఎమ్మార్వో ఆఫీస్ నందు ధర్నా డిమాండ్లతో కూడుకున్న వినతిపత్రం ఎమ్మార్వో వీరేంద్ర గౌడ్ కి ఇవ్వడం జరిగింది సిపిఐ సిపిఐ జిల్లా కార్య వర్గ సభ్యులు భాస్కర్,యాదవ్ సిపిఐ మండల కార్యదర్శి వీరేష్ రైతు సంఘం తాలూకా ఆంజనేయ మాట్లాడుతూ రాజోలిబండ డైవర్షన్ స్కీం కు కుడి కాలువ నిర్మాణాన్ని పూర్తి చేసి రైతులకు సాగునీరు, అందించాలని ఆర్డీఎస్ లో నీరు లేక పోవడంతో ఇసుకమేటలతో కనిపిస్తుందన్నారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమయ్యేనాటికి ఆర్డీఎస్ నిండుకుండలా కళకళలాడేదన్నారు. వర్షాలు లేకపోవడంతో వెలవెలబోతుందన్నారు. కావున ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తక్షణమే రైతులను, ప్రజలను దృష్టిలో ఉంచుకుని ఆర్డీఎస్ కుడి కాలువ ప్రాజెక్టు పూర్తి చేసి రైతులకు సాగునీరు, తాగునీరు అందించాలన్నారు. అలాగే మంత్రాలయం నుండి కర్నూలుకు రైల్వేలైన్ ఏర్పాటు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎఐవైయఫ్ జాఫర్ పటేల్ తిక్కన డోలు హనుమంతు గోపాల్ రామాంజనేయులు నరసింహులు నాగేంద్ర రామాంజనేయులు నాగరాజ్ తదితరులు పాల్గొన్నారు

# గోదాముల సంఖ్య పెరిగినా సమస్యలే

**పెరిగిన పంటల దిగుబడితో స్థల సమస్య**

హైదరాబాద్,ఆగస్ట్5 : తెలంగాణ ఏర్పడ్డ తరవాత ప్రభుత్వం ఆయా జిల్లాల్లో పెద్ద ఎత్తున గోదాముల నిర్మాణాన్ని చేపట్టింది. గోదాముల సంఖ్యను భారీగా పెంచింది. అయినా పంట ఉత్పత్తులు పెరగడంతో గోదాములు మాత్రం ధాన్యంకు తగ్గట్లుగా సరిపోవడం లేదని తేలింది. ఇటీవల మిల్లర్లు కూడా ఇదే విషయంచెప్పారు. మిల్లుల్లో ధాన్యం మొలకెత్తుతున్న విషయాలను చూస్తున్నాం. ఇంతకాలం మభ్య పెడుతూ వచ్చిన పాలకుల తీరు తెలంగాణ ఏర్పడ్డ తరవాత తెలిసి పోయింది. గతేడాది, మొన్నీమధ్య ధాన్యం కొనుగోళ్లను గ్రామాల వారీగా చేపట్టిన తరవాత ఇంకా గోదాముల కొరత ఏర్పడుతోంది. పలు జిల్లాలో గోదాముల సౌకర్యం లేకపోవడం కారణంగా కందుల కొనుగోళ్లపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ఈ సమస్యను పక్కన పెట్టి చూపడంతో ప్రైవేట్ వ్యాపారులు ఇదే అదనుగా రైతుల నుంచి తక్కువ ధరలకు కందులు కొనుగోళ్లు చేస్తున్నారు. జిల్లాలో పండే కంది పంటను దృష్టిలో ఉంచుకుని ముందస్తుగా కనీస జాగ్రత్తలు పాటించినట్లైతే ఇప్పుడు ఇటువంటి ఇబ్బందులు ఉండేవి కావని రైతు నాయకులు అంటున్నారు. అయితే గోదాముల సంఖ్య పెంచినా లెక్కకు మిక్కిలి పంటలు వస్తున్నాయని మార్క్‌ఫెడ్ అధికారులు అంటున్నారు. అయినా రైతులు ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకున్నారు. ఇక్కడి గోదాములు నిండిపోవడంతో రవాణా చేయడానికి అనుమతి ఇవ్వాలని మిల్లర్లు కోరుతున్నారు. గోదాములు నిండిపోవడంతో ఆరుబయటనే నిల్వ చేసుకోవాల్సి వచ్చింది. గోదాముల్లో నిల్వ చేయడంతో ఇక్కడ కొనుగోలు చేసిన పంటల నిల్వకు చోటు కరవైంది. కొనుగోలు చేసిన కందులను నిల్వ చేసుకునే విషయంలో అధికారులకు.. పాలకులకు ముందు చూపులేకుండా పోయింది. రవాణ ఖర్చులను దృష్టిలో పెట్టుకుని స్థానికంగా అందుబాటులో ఉన్న సీడబ్ల్యూసీ, ఎస్‌డబ్ల్యూసీ గోదాముల్లో నిల్వ చేసుకోవాలని కేంద్ర ప్రభుత్వం చెబుతుంది.

## మల్కాజిగిరి దుర్గాభవాని ఆలయంలో చోరీ

**బంగారం, వెండి, నగదు దోచుకున్న దొంగలు**

హైదరాబాద్,ఆగస్ట్5 : మల్కాజ్ గిరిలోని గౌతంనగర్ సమీపంలో దుర్గాభవాని ఆలయంలో చోరి జరిగింది. శుక్రవారం రాత్రి ఆలయం గోడకు దొంగలు కన్నం పెట్టి లోపలికి చొరబడ్డారు. ఆలయంలో ఉన్న 20 తులాల బంగారం, 2 కిలోల వెండిని దొంగలు అపహరించుకుపోయారు. ఇక, కౌంటర్ లోని రూ.80వేలు, హుండీలో ఉన్న నగదును దొంగలించారు. బంగారం, నగదుతోపాటు ఆలయంలో ఉన్న సిసి కెమరాల ఫుటేజ్ కూడా దొంగలు ఎత్తుకెళ్లారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటనాస్థలానికి చేరుకుని పరిశీలించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దొంగల కోసం గాలింపు చర్యలు చేపట్టారు.మరోవైపు రంగంలోకి దిగిన క్లూస్ టీమ్ ఆధారాలు సేకరిస్తోంది.ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివారలు తెలియాల్సి ఉంది.

## జిల్లా వ్యాప్తంగా టిడిపి శ్రేణుల ఆందోళన

**పుంగనూరు దాడి ఘటనపై మండిపడ్డ టిడిపి**
**మాజీమంత్రి పరిటాల సునీత అరెస్ట్**

అనంతపురం,ఆగస్ట్5: పుంగనూరులో టిడిపి శ్రేణులపై రాళ్లదాడిని నిరసిస్తూ ... ఉమ్మడి అనంతపురం జిల్లాల్లో టిడిపి నాయకులు శాంతియుత నిరసనలకు పిలుపునిచ్చిన నేపథ్యంలో ... శనివారం జిల్లా వ్యాప్తంగా టిడిపి నాయకులను పోలీసులు గృహనిర్బంధం చేశారు. పలువురి నిరసనలను అడ్డుకున్నారు. ఈ క్రమంలో ... మాజీ మంత్రి పరిటాల సునీత చెన్నేకొత్తపల్లిలో నిరసన తెలపటానికి వెళుతుండగా, 44వ జాతీయ రహదారిపై మరూరు టోల్ గేట్ వద్ద పోలీసులు అడ్డుకోవడంతో జాతీయ రహదారిపై కార్యకర్తలతో కలిసి సునీత బైఠాయించి నిరసన తెలిపారు. పోలీసుల తీరుపై ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు.

మరోవైపు హిందూపురంలో టిడిపి పట్టణ అధ్యక్షుడు రమేశ్‌తో పాటు పలువురు టిడిపి నేతలను పోలీసులు గృహ నిర్బంధం చేశారు. పుంగనూరులో టీడీపీ అధినేత చంద్రబాబుపై వైసీపీ దాడిని నిరసిస్తూ ఆందోళనకు దిగిన మాజీ మంత్రి పరిటాల సునీతను పోలీసులు అరెస్ట్ చేశారు. ఎన్ఎస్ గేట్ వద్ద నిరసన చేసేందుకు వెళుతున్న సునీతను మరూరు టోల్ ప్లాజా వద్ద పోలీసులు అడ్డుకున్నారు. పోలీసులు అడ్డుకోవడాన్ని నిరసిస్తూ టోల్ ప్లాజా వద్ద పరిటాల సునీత, టీడీపీ నేతలు, కార్యకర్తలు రోడ్డుపై బైఠాయించి నిరసనకు దిగారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సునీత మాట్లాడుతూ... చంద్రబాబుపై రాళ్లు వేస్తే పోలీసులు అడ్డుకోరు కానీ.. తమను మాత్రం అడ్డుకుం టారని మండిపడ్డారు.

### గాయపడ్డ పోలీసులను పరామర్శించిన మంత్రి పెద్దిరెడ్డి

చిత్తూరు పుంగనూరు ఘటనలో గాయపడ్డ పోలీసులను చిత్తూరు ప్రధాన ఆసుపత్రి లో శనివారం ఉదయం మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పరామర్శించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడు తూ సంఘటన బాధాకరం. పోలీసులు త్వరగా కోలుకునేలా అవసరమైన వైద్య సేవలు అందించడం జరుగుతోంది. ఈ సంఘటనను తీవ్రంగా ఖండిస్తున్నా మని అన్నారు. మంత్రి వెంట జిల్లా కలెక్టర్ ఎస్. షన్మోహన్, ఎస్.పి రిషాంత్ రెడ్డి, చిత్తూరు, పూతలపట్టు శాసనసభ్యులు ఆరణి శ్రీనివాసులు ఎం.ఎస్. బాబు, చిత్తూరు నగర మేయర్ అముద, చుడా చైర్మన్ పురుషోత్తం రెడ్డి,డిప్యూటీ మేయర్ రాజేష్, కుమార్ రెడ్డి, డి ఎం అండ్ హెచ్ ఓ డాక్టర్ ప్రభావతి డి సి హెచ్ ఎస్ డాక్టర్ నాయక్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ అరుణ్ కుమార్, అపోలో ఇంఛార్జి నరేష్ కుమార్ రెడ్డి కార్పొరేటర్లు ప్రజాప్రతినిధులు వున్నారు

# సీఎం పేషీలో డిజిటల్ సిగ్నేచర్ స్కాం

విజయవాడ, ఆగస్టు 5, ఏపీ సచివాలయంలోని ముఖ్యమంత్రి కార్యాలయంలో ఉద్యోగులు సీఎం రిలీఫ్ ఫండ్ కోసం అక్రమాలకు పాల్పడ్డారనే వార్తలు కలకలం రేపాయి ఈ ఆరోపణలపై ముగ్గురు ఉద్యోగులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో ఈ ఫైలింగ్ సదుపాయాన్ని అందుబాటులోకి తీసుకురావడంతో కాగితరహితంగానే వ్యవహారాలు జరుగుతున్నాయి. దీనిని ఆసరాగా చేసుకుని కొందరు ఉద్యోగులు అక్రమాలకు పాల్పడుతున్నారు. ఉన్నతాధికారుల వద్ద మాత్రమే ఉండాల్సిన డిజిటల్ కీలు కింద స్థాయి సిబ్బందికి చేరుతుండటంతో వాటిని యథేచ్ఛగా వాడేస్తున్నారు.ఏపీలో ప్రభుత్వ కార్యక్రమాలన్నీ చాలా కాలంగా కంప్యూటర్లలోనే సాగుతున్నాయి. పాలనా సంబంధిత వ్యవహారాల్లో పేపర్‌లెస్ వర్క్‌కు ప్రాధాన్యం ఇవ్వడంతో అన్ని సెక్షన్ల నుంచి ఉన్నత స్థాయి అధికారుల వరకు ఈ ఫైలింగ్ జరుగుతోంది.ముఖ్యమంత్రి సహాయ నిధి సాయాన్ని కోరడం నుంచి, ఉద్యోగుల బదిలీ పోస్టింగ్ వరకు ప్రభుత్వ ఉత్తర్వుల కోసం వచ్చే దరఖాస్తులన్నీ 'ఈ-ఫైలింగ్' ద్వారానే సీఎం పేషీకి చేరుతున్నాయి. వాటిని పరిశీలించి సీఎం పేషీ నుంచి ఉత్తర్వులు జారీ చేస్తుంటారు. ఇలా వచ్చే అభ్యర్థనల్లో కొన్నింటికి నేరుగా ముఖ్యమంత్రి ఆమోదించాల్సి ఉండగా మరికొన్నింటిని సీఎం పేషీలోని ఐఏఎస్ అధికారులు అమోద ముద్ర వేస్తే సరిపోతుంది.ఈ ఫైలింగ్ వెబ్‌సైట్‌లో ఉద్యోగుల ఐడీతో లాగిన్ అయి, ఫైల్ అమోదించడానికి డిజిటల్ సైన్ చేయాల్సి ఉంటుంది. కీలకమైన ఈ లాగిన్, డిజిటల్ సిగ్నేచర్లు చేసే తీరిక కూడా లేని కొందరు అధికారులు వాటిని కింద స్థాయి సిబ్బందికి అప్పగించారనే ఆరోపణలు ఉన్నాయి.ఈ-ఫైలింగ్ అనుమతుల మంజూరు చేయడానికి సంబంధిత వ్యక్తులతో బేరాలు చేసుకుంటున్నారు. సిఎంఆర్ఎఫ్ నిధుల విడుదల, బదిలీ వంటి వ్యవహారాల్లో లక్షల్లో బేరం కుదుర్చుకుని పని పూర్తి కాగానే డబ్బులు వసూలు చేశారనే ఆరోపణలు ఉన్నాయి. ఇలా డిజిటల్ కీ దుర్వినియోగం చేసి లక్షల్లో వసూలు చేశారు. ముఖ్యమంత్రి కార్యాలయంలోని అధికారుల లాగిన్ వివరాలతో కావాల్సిన ఫైళ్లను.. ఉన్నతాధికారులకు తెలియకుండా డిజిటల్ సిగ్నేచర్ ద్వారా అప్రూవల్ ఇచ్చేశారు.ఇలా అక్రమంగా వందల సంఖ్యలో సీఎంపీలు జారీ చేసినట్లు ఇటీవల వెలుగు చూసింది. ఈ అంశం ముఖ్యమంత్రి కార్యదర్శి ధనుంజయ్ రెడ్డి దృష్టికి రావడంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. సీఎంపీల ఫోర్జరీ, లాగిన్ వివరాల దుర్వినియోగంపై సిఎంఓ పేషీలోని అటెండర్ సీతారాం, సీఎం కార్యాలయంలో డేటా ఎంట్రీ ఆపరేటర్లుగా పని చేస్తున్న సాయి, శ్రీనివాస్‌ల ప్రమేయం

ఉందనే అనుమానంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు.రెండు రోజుల క్రితం పోలీసులు ముగ్గురు ఉద్యోగులను అరెస్టు చేశారు. విచారణలో మరికొందరి పేర్లు బయటకు వచ్చినట్లు తెలుస్తోంది. ముఖ్యమంత్రి కార్యాలయంలో పనిచేసే ఐఏఎస్ అధికారి మామ ప్రమేయం కూడా వెలుగు చూసింది. తన అల్లుడి పేషీలోని సెక్షన్ ఆఫీసర్ కలిసి సొంతంగా ఫైళ్లు 'క్లియర్' చేయిస్తున్నట్లు వెలుగు చూసింది.సిఎంఓలో పనిచేసే సెక్షన్ ఆఫీసర్ డీల్ చేసిన ఫైళ్లకు సంబంధించిన సాక్ష్యాలు కూడా ప్రభుత్వం వద్దకు చేరినట్టు తెలిసింది. నేరుగా సీఎం లాగిన్‌లోకి వెళ్లి కొన్ని ఫైళ్లను అక్రమంగా క్లియర్ చేసినట్టు తెలుస్తోంది. సెక్షన్ ఆఫీసర్‌ను అరెస్టు చేస్తే ఐఏఎస్ అధికారితో పాటు ఆయన మామ పేరు కూడా బయటికి వస్తుందనే ఉద్దేశంతో కేసు నుంచి పక్కకు తప్పించినట్లు సచివాలయంలో ప్రచారం జరుగుతోంది. సిఎస్ వద్ద పనిచేసే మరో ఉద్యోగి పాత్ర కూడా ఉందని ఉద్యోగుల్లో ప్రచారం జరుగుతోంది.

# టీడీపీ నిరసన

విజయవాడ పుంగనూరు లో చంద్రబాబు పై జరిగిన దాడి కి నిరసనగా పశ్చిమ టీడీపీ పార్టీ కార్యకర్తలు కాళేశ్వరమార్కెట్ వద్ద నిరసన కార్యక్రమం చెనట్టారు. టీడీపీ నే ఎంకే బేగ్ మాట్లాడుతూ ఈ రోజు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఒక చీకటి రోజుగా చూడాలి. గతంలో ఎన్నో ఇరిగేషన్ ప్రాజెక్ట్ లు పూర్తి చేసిన ఘనత చంద్రబాబుది. జగన్ మోహన్ రెడ్డి నీచ పాలనకు ఇదే నిదర్శమని అన్నారు. 14 సంవత్సరాల ముఖ్య మంత్రి గా చేసిన చంద్రబాబు మీద మీ గుండాలతో అరాచకాలు చేయించారు. జగన్ మోహన్ రెడ్డి నీకు గుండా రాజకీయం తప్ప అభివృద్ధి పాలనా చేతకాదు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కొత్త పాలన కోరుకుంటుంది. బీహార్ పాలన కన్నా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం వెనుక బడింది. ఒక్క ప్రాజెక్ట్ పూర్తి చేయలేదు నీకు గుండా రాజకీయం తప్ప ఇంకా నీకు చేత కాదని అన్నారు. త్వరలోనే మీ మంత్రులను ప్రజలు తగిన బుద్ది చెబుతారు. కేశినేని ఆధ్వర్యంలో పశ్చిమ నియోజకవర్గం లో టీడీపీ పార్టీ ని ముందుకు తీసుకువెళ్తామని అన్నారు.

### మహాశక్తి కార్యక్రమాన్ని ప్రారంభించిన మాజీమంత్రి నారాయణ

నెల్లూరు నెల్లూరు నగరంలోని 5వ డివిజన్ లో మహాశక్తి కార్యక్రమాన్ని మాజీమంత్రి పొంగూరు నారాయణ ప్రారంభించారు. మహిళల్ని గౌరవించుకోవడమే శ్రీ శక్తి ఉద్దేశం అన్నారు. మహానాడులో చంద్రబాబు మహిళల కొరకు ప్రత్యేకంగా మాహశక్తిని రూపొందించారన్నారు.నిత్యవసర వస్తువులు ధరలు పెరిగాయి.. మహిళలు కష్టపడుతున్నారనీ ఆవేదన వ్యక్తం చేశారు.మహిళలకు పెద్దపీట వేసే ఏకైక ప్రభుత్వం మనదే అన్నారు.తొలి మానిఫెస్ట్ లోనే మహిళకు చంద్రబాబు అధిక ప్రాధాన్యత ఇచ్చారన్నారు.18 నుండి 59 ఏళ్లు మద్య ఉన్న మహిళలకు నెలకు 1500 రూపాయలు ఇస్తామని ప్రకటించారు..చదువుకునే పిల్లలకు సంవత్సరానికి 15 వేలు చరిత్రలో నిలిచిపోతుందన్నారు.మహిళలకు సంవత్సరానికి మూడు సిలిండర్లు, ఆర్టీసి బస్సుల్లో ఉచిత ప్రయాణం అందిస్తామన్నారు.2024లో టిడిపి ఖచ్చితంగా అధికారంలోకి వస్తుంది..మహిళలకు పథకాలు అందిస్తాం.. మరికొన్ని పథకాలను కూడా రూపొందిస్తామని అన్నారు.

## కానిస్టేబుల్ రమేష్ హత్యకేసు

### నిందితురాలు భార్య అరెస్టు

విశాఖపట్నం వన్టౌన్ పోలీసు స్టేషన్ కానిస్టేబుల్ బర్రి రమేష్ మృతికేసును పోలీసులు చేధించారు. రమేష్ మృతి కేసులో అతడి భార్య శివజ్యోతి అలియాస్ శివానినే హంతకురాలిగా పోలీసులు తేల్చారు. ప్రియుడి మోజులో పడి శివాని.. రమేష్ను హత్య చేసినట్టు పోలీసులు నిర్ధారించారు. ఈ మేరకు విశాఖ నగర కమిషనర్ త్రివిక్రమ్ ఈ కేసు వివరాలను వెల్లడించారు.ఈ క్రమంలో సీపీ త్రివిక్రమ్ వర్మ మీడియా తో మాట్లాడుతూ.. కానిస్టేబుల్ రమేష్ ను అతడి భార్య శివాని హత్య చేయిం చిందని,మూడు రోజుల క్రితం రమేష్ అనుమానాస్పదంగా మృతిచెందాడని శివాని పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేసిందని రమేష్ మృతదేహంపై ఎలాంటి గాయాలు లేకపోవడంతో డెడ్బాడీని పోస్టుమార్టంకు పంపిం చామని,రిపోర్టులో రమేష్.. ఊపిరా డక చనిపోయి నట్టు తేలిందని చెప్పా రు.చివరికి ఈ నేపథ్యంలో ఈ కేసులో లోతుగా విచారణ చేపట్టమని తెలిపా రు.ఈ కేసు దర్యాప్తులో భాగంగా భార్య శివానినే ప్రియుడి కోసం భర్త రమేష్ను హత్య చేసిందని చెప్పారు.

# జూలైలో 129 కోట్లకు చేరిన తిరుమల ఆదాయం

తిరుమల, ఆగస్టు 5, తిరుమల తిరుపతి దేవస్థానానికి జులై నెలలో రికార్డు స్థాయి ఆదాయం వచ్చింది. హుండీ కానుల రూపంలో భక్తుల నుంచి స్వామివారికి రూ.129.08 కోట్లు వచ్చినట్లు టీటీడీ ఈఓ ధర్మారెడ్డి తెలిపారు. తిరుమల శ్రీవారి దర్శనానికి వచ్చి గదులు పొందిన భక్తులకు ప్రస్తుతం రీఫండ్‌కు సంబంధించిన సమాచారాన్ని ఎస్ఎంఎస్ ద్వారా పంపుతున్నామని, త్వరలో రీఫండ్‌ను ట్రాక్ చేసేందుకు టీటీడీ వెబ్‌సైట్‌లో ట్రాక్‌ర్‌ను పొందుపరుస్తామని తెలిపారు. భక్తులకు చెల్లించే రీఫండ్ సొమ్ము సమాచారాన్ని ట్రాకింగ్ ద్వారా తెలుసుకోవచన్నారు. తిరుమలలో యుపీఐ విధానంలో చెల్లింపులు చేసి గదులు పొందిన భక్తులకు వారు గదులు ఖాళీ చేసిన వెంటనే కాషన్ డిపాజిట్ మొత్తం రీఫండ్ చేయడం జరుగుతోందని చెప్పారు. క్రెడిట్ కార్డు, డెబిట్ కార్డు ద్వారా చెల్లింపులు చేసి గదులు పొందిన భక్తులకు 3 నుంచి 5 పనిదినాలలోపు వారి ఖాతాలకు కాషన్ డిపాజిట్ మొత్తం జమ చేస్తున్నట్లు తెలిపారు. ఎస్ఎంఎస్‌లో సూచించిన విధంగా 3 నుంచి 5 రోజులు వేచి ఉండడం లేదని వివరించారు. మరికొందరు టీటీడీ నిబంధనల ప్రకారం గది ఖాళీ చేయడం లేదని, వెరిఫికేషన్ కోడ్ సబ్‌మిట్ చేయకపోవడం, ఫొటో సరిపోలకపోవడంతో రీఫండ్ జనరేట్ కావడం లేదని చెప్పారు.ఆగస్టు 27 నుంచి 29వ తేదీ వరకు శ్రీవారి ఆలయంలో పవిత్రోత్సవాలు జరుగనున్నాయి. ఏడాది పొడవునా ఆలయంలో జరిగే అర్చనలు, ఉత్సవాల్లో యాత్రికుల వల్లగానీ, సిబ్బంది వల్లగానీ తెలియక కొన్ని దోషాలు జరుగుతుంటాయి. వీటివల్ల ఆలయ పవిత్రతకు ఎలాంటి లోపం రానీయకుండా ఆగమశాస్త్రం ప్రకారం పవిత్రోత్సవాలు నిర్వహిస్తారు. సీఆర్ఓలో లక్కీడిప్ ద్వారా ఆర్జిత సేవా టికెట్లు పొందిన భక్తులకు జూలై 19వ తేదీ నుంచి ప్రయోగాత్మకంగా ఎస్ఎంఎస్ ద్వారా పేలింక్ పంపుతున్నట్లు ఈవో చెప్పారు. భక్తులు తిరిగి కౌంటరు వద్దకు వెళ్లాల్సిన అవసరం లేకుండా నెట్ బ్యాంకింగ్ లేదా యుపీఐ లేదా క్రెడిట్ కార్డు లేదా డెబిట్ కార్డు ద్వారా ఆన్లైన్‌లో సొమ్ము చెల్లించి సేవా టికెట్లు ప్రింట్ తీసుకోవచ్చని ఈవో వివరించారు. త్వరలో ఎంబీసీ-34 కౌంటర్ వద్ద విచక్షణ కోటాలో కేటాయించే ఆర్జిత సేవా టికెట్లు, బ్రేక్ దర్శన టికెట్లకు కూడా ఈ విధానం అమలుచేస్తామని చెప్పారు.తిరుమల శ్రీవారి ఆలయం వద్ద గల పుష్కరిణిలో నీటిని పూర్తిగా తొలగించి పైపులైన్ల మరమ్మతులు, సివిల్ పనులు చేపట్టేందుకు ఆగస్టు 1 నుంచి పుష్కరిణిని మూసివేస్తున్నట్లు ఈవో చెప్పారు.. ప్రతి ఏటా బ్రహ్మోత్సవాల సందర్భంగా ముందు ఈ పనులు చేయడం ఆనవాయితీ అన్నారు. ఈ కారణంగా నెల రోజుల పాటు పుష్కరిణి హారతి ఉండదన్నారు. శ్రీవారి భక్తులు పుణ్యస్నానాలు చేసేందుకు వీలుగా పుష్కరిణి పైభాగంలో షవర్లు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. తిరుపతి జిల్లాను క్యాన్సర్ రహితప్రాంతంగా తయారు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సామూహిక క్యాన్సర్ స్క్రీనింగ్ కార్యక్రమానికి టీటీడీ సంపూర్ణ సహకారం అందిస్తోందని ఈవో వెల్లడించారు. గ్రామీణ ప్రాంతాల్లో మహిళలకు క్యాన్సర్ పరీక్షలు ఉచితంగా నిర్వహించడం కోసం ఒక పింక్ బస్సును ఆధునిక వైద్యపరికరాలతో జిల్లా యంత్రాంగానికి విరాళంగా అందిస్తామన్నారు. అలాగే, గూడురు, చంద్రగిరి, శ్రీకాళహస్తిల్లో క్యాన్సర్ నిర్ధారిత కేంద్రాలకు మరో పింక్ బస్ అందించడానికి ప్రయత్నాలు జరుగుతున్నట్లు వెల్లడించారు. అలాగే స్విమ్స్‌లో మరో పింక్ బస్ ఏర్పాటు చేస్తామన్నారు. టాటా క్యాన్సర్ ఆసుపత్రికి కూడా ఒక పింక్ బస్ అందిస్తామని చెప్పారు.స్విమ్స్‌లో త్వరలో లివర్ మార్పిడి శస్త్రచికిత్సలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. అలాగే స్విమ్స్ సర్జికల్ గ్యాస్ట్రో ఎంటరాలజీ విభాగం రాష్ట్రంలో మరెక్కడా లేని హెచ్‌పీబీ (హెపటో పాంక్రియాటో బిలియరీ) సర్టిఫికేట్ కోర్సును నిర్వహిస్తోందన్నారు. ఎయిమ్స్ తదితర ప్రతిష్టాత్మక సంస్థల్లో సూపర్ స్పెషాలిటీ గ్యాస్ట్రో ఎంటరాలజీ చదువుతున్న ఫైనలియర్ విద్యార్థులు ఈ కోర్సును అభ్యసిస్తున్నారని తెలిపారు. 50 సీట్లు ఉన్నాయని వీరికి ప్రముఖ వైద్యులతో శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు.

జూలై నెలలో తిరుమలలో నమోదైన వివరాలు :

దర్శనం : శ్రీవారిని దర్శించుకున్న భక్తుల సంఖ్య - 23.23 లక్షలు

హుండీ : హుండీ కానుకలు - రూ.129.08 కోట్లు

లడ్డూలు : విక్రయించిన శ్రీవారి లడ్డూల సంఖ్య - 1.10 కోట్లు

అన్నప్రసాదం : అన్నప్రసాదం స్వీకరించిన భక్తుల సంఖ్య - 56.68 లక్షలు

కల్యాణకట్ట : తలనీలాలు సమర్పించిన భక్తుల సంఖ్య - 9.74 లక్షలు

# నవోదయ స్కూలులో ఫుడ్ పాయిజన్

ఏలూరు ఏలూరు జిల్లా పెదవేగి మండలం లక్ష్మీపురం గ్రామం నవోదయ విద్యాలయం లో ఫుడ్ పాయిజన్ కావడంతో 42 మంది విద్యార్థులకు అస్వస్థతకు గురి అయ్యారు. సమాచారం తెలుసుకున్న దెందులూరు శాసన సభ్యుడు కొఠారి అబ్బాయి చౌదరి పెదవేగి తహసీల్దార్, మండల మేజిస్ట్రేట్ నల్లమెల్లి నాగరాజు పోలీస్ అధికారులు వివిధ శాఖల అధికారులు హుటాహుటిన పెదవేగి నవోదయ విద్యాలయ కు చేరుకున్నారు. ఈ నెల 3వ తేదీన ఈ పాఠశాలలో అంతర్రాష్ట్ర నవోదయ విద్యాలయాల విద్యార్థులకు జరిగే క్రీడల పోటీలలో పాల్గొనేందుకు కేరళ, కర్ణాటక, తదితర రాష్ట్రాలనుండి పెదవేగి నవోదయ పాఠశాలకు చేరుకున్నారు. పాఠశాల యాజమాన్యం క్రీడాకారులకు గురువారం రాత్రి చికెన్ కర్రితో భోజనం శుక్రవారం ఉదయం వెజ్ బిర్యానీ పెట్టారు.ఈ రెండు ఆహార పదార్థాలలో ఎక్కడ తేడా జరిగిందో మరి ఇతర రాష్ట్రాలకు చెందిన విద్యార్థులు అస్వస్థత పాలవడం తో పాఠశాల యాజమాన్యం దెందులూరు ఎం ఎల్ ఏ అబ్బయ్య చౌదరి, వివిధ శాఖల అధికారులు వారి ని ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రస్తుతం విద్యార్థుల ఆరోగ్య పరిస్థితి బాగానే ఉందని తహసీల్దార్ ఎన్ నాగరాజు తెలిపారు.

## మంత్రి వనితకు కృతజ్ఞతలు తెలిపిన గల్ఫ్ బాధితురాలు

కొవ్వూరు ఏజెంట్ చేతిలో మోసపో యి మస్కట్ లో చిక్కుకుపోయిన ఒక యువతి హోంమంత్రి తానేటి వనిత చొరవతో తన స్వగ్రామం చేరుకున్నారు. దీంతో హోంమంత్రి క్యాంపు కార్యా లయంలో మంత్రిని కలిసి ఆ కుటుంబ మంతా కృతజ్ఞతలు తెలిపింది. ఇటీ వల తూర్పు గోదావరి జిల్లా నిడదవో లు మండలం తిమ్మరాజు పాలెంకు చెందిన గెడ్డం ప్రభ ఉపాధి వెతుక్కుం టూ మస్కట్ కు వెళ్లిందని,తన కూతు రుకి అక్కడ ఎదురైన పరిస్థితిని తల్లి కొండేపూడి సత్యవతి వివరించడంతో హోంమంత్రి చలించిపోయారు. చేతిలో చిల్లిగవ్వలేక, అర్ధాకలితో జీవించలేక తిరిగి స్వదేశం వచ్చేందుకు ఆదుకునే హస్తం కోసం ఎదురు చూస్తున్న సమ యంలో హోంమంత్రి చొరవ తీసుకుని బాధితురాలిని స్వగ్రామానికి తీసుకు రావడంతో ఆనందం వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా హోంమంత్రి మాట్లాడు తూ.. దళారులు, మధ్యవర్తుల మాట లు నమ్మి మోసపోవద్దని సూచించారు. మోసం చేసిన ఏజెంట్ పై చట్టప్రకారం తగిన చర్యలు తీసుకుంటామని ఆమె తెలిపారు.

## పుంగనూరు ఘటనకు మంత్రి పెద్దిరెడ్డి బాధ్యత వహించాలి

అనంతపురంచిత్తూరు జిల్లా పుంగనూరు, అంగళ్లు లో జరిగిన సంఘటనలకు పెద్దిరెడ్డి, పోలీసులే బాధ్యత వహించాలని మాజీమంత్రి కాల్వ శ్రీనివానులుడి మాండ్ చేశారు. చంద్రబాబు కాన్వా యితో పాటు టీడీపీ శ్రేణులపై జరిగిన దాడిని ఆయన తీవ్రంగా ఖండించారు. అసలు రాష్ట్రంలో ప్రజాస్వామ్యం ఉం దా అని ప్రశ్నించారు. చంద్రబాబు ఒక ప్రతిపక్ష నేతగా 14ఏళ్లు ముఖ్యమంగా పని చేసిన వ్యక్తి తన సొంత జిల్లాలో పర్యటిస్తే.. ఇలాంటి దాడులకు పాల్ప డుతారా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. అసలు చంద్రబాబు జిల్లాలో పర్యటిస్తే మీకెందుకు అంత భయం అని ప్రశ్నిం చారు. ఇలాంటి దాడులకు టీడీపీ శ్రేణులు భయపడే ప్రసక్తే లేదని.. మరో సారి ఇవి రిపీట్ అయితే జరగబోయే పరిణామాలకు ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరిం చారు..

# తమిళనాడులో అలా...మరి ఆంధ్రలో...

విజయవాడ, ఆగస్టు 5, తమిళనాడులో బీజేపీ పుంజుకుంటోంది. నిజానికి తమిళనాడు అంటే కొన్ని ప్రత్యేమైన భావజాలాలు ఉండే రాష్ట్రం. అక్కడ బీజేపీ నిలదొక్కుకోవడం కష్టమన్న అభిప్రాయం ఉండేది. కానీ మాజీ ఐపీఎస్ అధికారి అయిన అన్నామలైను అధ్యక్షుడిగా నియమించిన తర్వాత ఆ పార్టీ రాత మారిపోయింది. ప్రజల్లో క్రేజ్ పెరిగింది. అక్కడ అన్నామలై పార్టీని అభివృద్ధి చేస్తున్నారు. ఇందు కోసం ఆయన డీఎంకే ప్రభుత్వంపై పూర్తి స్థాయిలో విరుచుకుపడుతున్నారు. డీఎంకే ఫైల్స్ పేరుతో డాక్యుమెంట్లు రిలీజ్ చేస్తున్నారు. మరి ఏపీలో మరో అన్నామలై ఎందుకు ఎదగలేకపోతున్నారు. .? దీనికి ఖచ్చితంగా హైకమాండే కారణం అని చెప్పకతప్పదు. అన్నామలై.. మాజీ ఐపీఎస్ అధికారి, సర్వీసులో ఉన్నప్పుడు ఆయన కర్ణాటకలో పని చేశారు. తర్వాత రాజకీయాలపై ఆసక్తితో వెంటనే సర్వీసు వదిలేశారు. ఆయనపై హైకమాండ్ నమ్మకం పెట్టుకుంది. అందుకే అవకాశం ఇచ్చింది. యువకుడిగా చురుగ్గా ఉండే అన్నామలై పార్టీ విధానాలకు అనుగుణంగా అవకాశాలు సృష్టించుకుని ముందుకు దూసుకెళ్లారు. అదే సమయంలో ఆయనకు హైకమాండ్ నుంచి కావాల్సినంత మద్దతు లభించింది. ఆయన ఏమడిగినా చేసి పెట్టింది. డీఎంకే అవినీతిపై పోరాటం అంటూ కొంత మంది జాబితా రిలీజ్ చేసి వారిపై దర్యాప్తు సంస్థలు విరుచుకుపడతాయని ప్రకటించారు. అన్నట్లుగానే దాడులు జరుగుతున్నాయి. దీంతో అన్నామలైకు క్రేజ్ మరింత పెరిగింది. డీఎంకేపై బీజేపీనే పోరాడుతోందన్న అభిప్రాయం ఏర్పడుతోంది. తమిళనాడులో బీజేపీ శాఖకు సహకరిస్తున్నట్లుగా సహకారం కాదు కదా.. అసలు రివర్స్‌లో వైసీపీకి సహకరిస్తున్నారన్న అసంతృప్తి పార్టీ నేతల్లో కనిపిస్తోంది. ఏపీ బీజేపీ అధ్యక్షురాలిగా పురందేశ్వరి బాధ్యతలు చేపట్టగానే దూకుడుగా వెళ్తున్నారు. వైసీపీపై తీవ్ర ఆరోపణలు చేస్తున్నారు. ప్రధానంగా ప్రభుత్వం ఆర్థిక అవకతవకలపై ప్రశ్నిస్తున్నారు. రూ. పది లక్ష కోట్లకుపైగా అప్పులు చేశారని లెక్కలు చెప్పారు. అయితే పురందేశ్వరి చేసిన ఆరోపణలను .. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంట్ లో ఖండించారు. అప్పులు నాలుగేళ్లలో రూ. లక్షా 70 వేల కోట్లే అప్పు తీసుకున్నారని ప్రకటించారు. నేరుగా కాకపోయినా ఓ ప్రశ్నకు ఇచ్చిన సమాదానంతో వైసీపీకి మేలు చేసినట్లయింది. ఇది చూసి చాలా మంది ఆశ్చర్యపోయారు. పాపం పురందేశ్వరి అని రాజకీయవర్గాలు అనుకున్నాయి. ఏపీ ప్రభుత్వ అప్పులు బహిరంగ రహస్యం. కార్పొరేషన్లు, మద్యం బాండ్లు, ఆస్తులు తనఖా పెట్టి పెద్ద ఎత్తున రుణాలు తెచ్చారు. అయినా వీటి గురించి ఏమీ తెలియనట్లుగా నిర్మలా సీతారామన్ చెప్పడంతో.. పురందేశ్వరికి సపోర్ట్ కాదు కదా మోరల్‌గా దెబ్బతీసినట్లయిందన్న అభిప్రాయం వినిపిస్తోంది. ముందుగా ఏపీ విషయంలో బీజేపీ హైకమాండ్ ఓ స్పష్టతకు రావాలని.. ఆ తర్వాతే.. పార్టీ నేతలకు దిశానిర్దేశం చేయాలని అంటున్నారు. ఏపీలో అన్ని రకాల అక్రమాలు జరుగుతున్నాయని పోరాటం చేయాలని సూచించడం? మళ్లీ ఆ అక్రమాలపై ప్రశ్నిస్తే.. కేంద్రమే అధికార పద్దతుల్లో బీజేపీ వాదనను ఖండించేలా సమాచారం రిలీజ్ చేయడం అంటే సొంత నేతల్ని కించపర్చడమేనని గుర్తు చేస్తున్నారు.

# పుంగనూరులో ఏం జరుగుతోంది...

తిరుపతి, ఆగస్టు 5, పుంగనూరు నియోజకవర్గం. ఈ పేరు ఇటీవలి కాలంలో చాలా సార్లు ప్రచారంలోకి వచ్చింది. అయితే అది అభివృద్ధి పనుల విషయంలో టామోటా పంటలను బాగా పండించిన విషయంలోనే కాదు.. రాజకీయ దాడుల విషయంలో. వైఎస్ఆర్‌సీపీ నేతలు కాకుండా మరే పార్టీ నేత అయినా సరే అక్కడ భయంతో బతకాల్సిందేనన్న విమర్శలు వస్తున్నాయి. టీడీపీ, జనసేన నేతల్నీ మాత్రమే కాదు ఇటీవల కొత్తగా పార్టీ పెట్టుకున్న రామచంద్ర యాదవ్ అనే నేతనూ పుంగనూరులో వైఎస్ఆర్‌సీపీ కార్యకర్తలు వదల్లేదు. మాట్లాడితే ఇళ్లపై దాడులు చేస్తారు. ఆస్తులు ధ్వంసం చేస్తారు. ఊళ్లలోకి అడుగులు పెట్టనీయరు. ఇప్పుడు చంద్రబాబు పర్యటన విషయంలోనూ అదే జరిగింది. పుంగనూరులోకి చంద్రబాబును అడుగుపెట్టనీయలేదు. తవ్ర ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడటంతో ఇంకా పరిస్థితి ముదరకుండా ఆయన వెళ్లిపోయారు. చంద్రబాబు పుంగనూరులోకి రానివ్వకుండా చేయడానకే ఇదంతా జరిగిందన్న ఆరోపణలు టీడీపీ వైపు నుంచి వస్తున్నాయి. పుంగనూరులో అత్యధికంగా దాడులకు గురయ్యే నేత ఎవరు అంటే.. టీడీపీ ఇంచార్జ్ చల్లా బాబు. ఆయన ఏ గ్రామానికి వెళ్లే ప్రయత్నం జరిగినా ఏదో చోట దాడులు జరుగుతాయి. ఆయన పర్యటనలకు వెళ్లాలంటే కనీసం యాభై మంది కార్యకర్తలను తీసుకుని వెళ్తారు. లేకపోతే ఎప్పుడు ఎలాంటి పరిస్థితి ఎదురవుతుందోనని అనుకుంటారు. చల్లా బాబుకు కంటే ముందు టీడీపీ ఇంచార్జ్ గా అనూషా రెడ్డి ఉండేవారు. పేరున్న రాజకీయ కుటుంబం నుంచి వచ్చిన ఆమె ఈ దాడుల రాజకీయాలను తట్టుకోలేక కన్నీరు పెట్టుకుని రాజకీయాల నుంచి విరమించుకున్నారు. చల్లా బాబు మొండిగా రాజకీయం చేస్తున్నారు. నియోజకవర్గంలో గ్రామాల్లో టీడీపీ కార్యకర్తలు ఎప్పుడు ఏం జరుగుతుందోనన్న భయంతో ఉంటారు. ఎన్నికల్లో జనసేన తరపున పోటీ చేసిన రామచంద్ర యాదవ్.. ఆ పార్టీలో లేరు. కానీ ఆయన పుంగనూరు నియోజకవర్గంలో సొంతంగా రాజకీయం చేయడం ప్రారంభించారు. ఇటవల కొత్త పార్టీ పెట్టుకున్నారు. పార్టీ పెట్టుకోక ముందు ఆయన .. నియోజకవర్గంలో రైతుల సమస్యలపై పోరాడేందుకు తిరిగేవారు. ఆయన విస్తృతంగా పర్యటిస్తూండటంతో.. ఓ రోజు రెండు వందల మందితో కూడిన అల్లరి మూక ఇంటిపై విరుచుకుపడింది. విధ్వంసం సృష్టించింది. చివరికి ప్రాణాలు కాపాడుకున్న రామచంద్ర యాదవ్ .. కేంద్ర హోంమంత్రి అమిత్ షాను కలిసి వై సెక్యూరిటీని ఏర్పాటు చేయించుకున్నారు. ఇటీవల సొంత పార్టీ పెట్టుకుని చిత్తూరు ఎయిర్ పోర్టు నుంచి ర్యాలీగా పుంగనూరు వెళ్లడానికి ప్రయత్నిస్తే ఆయనను పోలీసులు ముప్పుతిప్పలు పెట్టారు. పుంగనూరు నియోజకవర్గంలో స్థానిక ఎన్నికల్లో ఇతర పార్టీల వాళ్లు నామినేషన్లు వేయడమే గొప్పగా అన్నట్లుగా సాగిపోయింది. పంచాయతీ ఎన్నికలు, పరిషత్ ఎన్నికల్లో ఏకగ్రీవాలే అత్యధికం. నామినేషన్ల ఉపసంహరణలోనూ ఆరోపణలు వచ్చాయి. ఇలా నామినేషన్ వేయడానికి వెళ్లిన అంజిరెడ్డి అనే పెద్దాయనపై దాడి చేయడానికి వైసీపీ కార్యకర్తలు ప్రయత్నిస్తే..ఆయన ఎదురు తిరిగి తొడకొట్టిన వీడియో అప్పట్లో వైరల్ అయింది. మొత్తంగా పుంగనూరు నియోజకవర్గంలో ఏపీలో అత్యంత సమస్యాత్మక నియోజకవర్గాల్లో ఒకటిగా మారుతోంది. ఈ నియోజకవర్గం నుంచి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి వరుసగా గెలుస్తూ వస్తున్నారు

## నులి పురుగుల నిర్మూలన దినం గోడ పత్రికల ఆవిష్కరణ



నంద్యాల మా ప్రతినిధి ఆగస్టు 05 విభారె న్యూస్ :-. ఆగస్టు 10 వ తేదిన నిర్వహిస్తున్న నులి పురుగుల నిర్మూలన కార్యక్రమం సందర్భంగా.. 1-19 సం. ల వయసు వారికి ఆల్ బెండజోలు -400 మి. గ్రా. మాత్రల పంపిణి కార్యక్రమం ను పురస్కరించుకొని నంద్యాల జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ ఆర్ . వెంకటరమణ ఆధ్వర్యములో వారి ఛాంబర్ నందు ఈ కార్యక్రమం ఇంచార్జి జిల్లా కో ఆర్డినేటర్ - డాక్టర్ .కాంతారావు నాయక్, జిల్లా ఇంచార్జి ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ . మల్లికార్జున రెడ్డి శనివారం " జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమం గోడ పత్రికలు ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య, ఆరోగ్య శాఖధికారి డాక్టర్ . వెంకటరమణ మాట్లాడుతూ , నంద్యాల జిల్లాలో ఆల్ బెండజోలు మాత్రలకు 1-19 సం. వయసు మొత్తం 4,06,219 మంది లబ్ధిదారులుగా గుర్తించామని, ఈ మాత్రలు అన్ని అంగన్వాడీ కేంద్రాలలో, అన్ని ప్రభుత్వ, ప్రయివేట్ విద్యా సంస్థలలో చదువుచున్న విద్యార్థులకు మరియు నర్సింగ్, సాంకేతిక విద్యా సంస్థలలో చదువుచున్న విద్యార్థులు అందరికి ఆగస్టు 10 వ తేదీ మధ్యాహ్నం భోజనం తరువాత మింగిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమం జరుగుటకు అవసరమైన మాత్రలు, ప్రచారం పోస్టర్లు,కరపత్రములు స్థానిక మండల అభివృద్ధి అధికారుల ద్వారా విద్యా సంస్థలకు, ఆరోగ్య సిబ్బంది ద్వారా అంగన్వాడీ కేంద్రాలకు చేర్చడం జరిగినది. ఈ కార్యక్రమం విజవంతం చేయడానికి జిల్లా, మండల స్థాయి విద్యా శాఖ అధికారులు, మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ అధికారులు, ఆరోగ్య శాఖధికారులు సమన్వయముతో సమిష్టిగా కృషి చేయవలసినదిగా కోరారు . ఈ కార్యక్రమం లో డాక్టర్ . భరత్, డీపిఎమ్ నజ్నీజ్, డీఎస్ ఓ సుజాత, ప్రోగ్రాం సిబ్బంది శివరాం, వెంకటరమణ పాల్గొన్నారు.

## అన్ని మతాల దేవుళ్ల చిత్ర పటాలకు మెమోరాండం



నంద్యాల మా ప్రతినిధి ఆగస్టు 05 విభారె న్యూస్ : రాష్ట్ర ప్రభుత్వానికి కళ్లు లేవని, అందుకే మా సమస్యలు కనిపించడం లేదని ఉమ్మడి కర్నూలు జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ ఒప్పంద, పొరుగు సేవల సిబ్బంది వేదావతి, కిరణ్ కుమార్, సుభాషిణి విమర్శించారు. తమ సమస్యల పరిష్కారం కోసం నంద్యాల కలెక్టరు కార్యాలయం వద్ద చేపట్టిన దీక్షలో భాగంగా శనివారం సిబ్బంది వినూత్న రీతిలో నిరసన తెలుపుతూ అన్ని మతాల దేవుళ్ల చిత్ర పటాలు పెట్టి చిత్ర పటాల వెనకాల సీఎం జగన్ మోహన్ రెడ్డి చిత్ర పటం ఉంచి వారి డిమాండ్లను సీఎం నెరవేర్చాలని దేవుళ్ల చిత్ర పటాలకు మెమోరాండం ఇస్తూ నిరసన తెలిపారు.. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ. తాము గత నాలుగు రోజులుగా దీక్ష చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో శంకర్రెడ్డి, ప్రదీప్, షేక్షావలి, మధుసూదనరెడ్డి, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## మార్కెట్ లో మున్సిపల్ కమిషనర్

నంద్యాల మా ప్రతినిధి ఆగస్టు 05 . విభారె న్యూస్ : స్థానిక పట్టణంలో శనివారం నాడు నంద్యాల మున్సిపల్ కమిషనర్ రవి చంద్రా రెడ్డి హెల్త్ ఆఫీసర్ అంకిరెడ్డి. శానిటేషన్ సూపరైజర్ లక్ష్మినారాయణ. శివ ప్రసాద్ రెడ్డి తో కలసి గాంధీ చౌక్ లో మార్కెట్ లో శానిటేషన్ పనులను పరిశీలించారు అనంతరం 1 టౌన్ పోలీసు స్టేషన్ వద్ద జరుగుతున్న పైపు లైన్ పనులను పరిశీలించారు. అలాగే 36 వార్డు లో ఉన్న పబ్లిక్ టాయిలెట్లను పరిశీలించారు. పరిసర ప్రాంతాల్లో పారిశుధ్య నిర్వహణను డ్రైనేజీ క్లీనింగ్ పనులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ పారిశుధ్య పనుల పై ఎక్కడ ఆలసత్వం ప్రదర్సించ వద్దని సిబ్బంది కి సూచించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ ఆఫీసర్ అంకిరెడ్డి. శానిటేషన్ సూపరైజర్ లక్ష్మినారాయణ. శివ ప్రసాద్ రెడ్డి. మున్సిపల్ సిబ్బంది . సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# కూరగాయల మార్కెట్ అవరణలో అగ్ని ప్రమాదం



నంద్యాల మా ప్రతినిధి ఆగస్టు 05 విభారె న్యూస్ :-నంద్యాల కూరగాయల మార్కెట్ అవరణలో నిర్వహించే ఫ్రూట్ హోల్ సేల్ మార్కెట్ లో భారీ అగ్ని ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో టన్నుల కొద్ది ఆపిల్ పండ్లు, దానిమ్మ పండ్ల పెట్టెలు కాలిపోయాయి.

### భారీగా అస్తి నష్టం
### పరామర్శించిన ఎమ్మెల్యే శిల్పా, టిడిపి భూమా జగత్ విఖ్యాత రెడ్డి

హోల్ సెల్ వ్యాపారులు ఈ గోదాముల్లో నిల్వ చేసి హోల్ సేల్ గా ఫ్రూట్స్ కు విక్రయిస్తారు. అకస్మాత్తుగా అగ్ని ప్రమాదం జరగడంతో పరిసర ప్రాంత ప్రజలు భయాందోళనలకు గురయారు. గోడౌన్ సమీపంలో నిలిచి ఉన్న రెండు వాహనాలు అగ్నికి ఆహుతయ్యాయి. ఘటన ప్రాంతాన్ని నంద్యాల ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి ఎమ్మెల్సీ షాక్ భాష మున్సిపల్ చైర్ పర్సన్ మహబున్నిసా మున్సిపల్ అధికారులు పరిశీలించారు. అన్ని విధాలా ఆదుకుంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు . అలాగే టిడిపి యువ నాయకులు భూమా జగద్ విఖ్యాత్ రెడ్డి సందర్శించి సంఘటన వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా భూమా జగత్ విఖ్యాత్ మాట్లాడుతూ మార్కెట్లో జరిగిన నష్టం అపారమైనదని, ప్రభుత్వం వీరిని ఆదుకోవాలన్నారు. దాదాపు 50 లక్షల ఆస్తి నష్టం వాటిల్లి ఉంటుందని, జిల్లా కలెక్టర్ స్పందించి వీరిని ఆదుకోవాలని అన్నారు. తాము కూడా ఈ విషయంపై జిల్లా కలెక్టర్ ను కలుస్తామన్నారు.

# రాహుల్ గాంధీ విషయంలో న్యాయమే గెలిచింది.



కర్నూలు ఆగస్టు 05 విభారె న్యూస్. రాహుల్ గాంధీ ని దేశ ప్రజలు ప్రధానిగా కోరుకొనుచున్నారని రాహుల్ గాంధీ విషయంలో న్యాయమే గెలిచిందని సుప్రీంకోర్టు తీర్పు హర్షినియమని రాహుల్ గాంధీ మంచి మనిషికి మంచే జరుగుతుందని మోదీ అన్యాయాలు చేస్తూ రక్తపాతాలు సృష్టిస్తూ మతాన్ని అడ్డుపెట్టుకుని రాజ్యమేలుతున్నారని నీ పరిపాలన ఎలాంటిదో మణిపూర్ సంఘటన చాలని మోదీ మరల ప్రధాని అయితే దేశమంతా మణిపూర్ లాంటి సంఘటనలు జరుగుతాయని ఇతర కులాల వారు మతాల వారు నివసించకూడదని ఆయన ఉద్దేశమని రాహుల్ గాంధీ పట్ల సుప్రీంకోర్టు స్టే తో ఈ దేశ ప్రజల ఆశ నిజమైందని అరచేతిని అడ్డుపెట్టి సూర్య కిరణాలు ఆపలేరని ప్రధాని మోదీ అధికార బలంతో స్వాతంత్ర సమరయోధుల కుటుంబం నుంచి వచ్చిన రాహుల్ గాంధీ ని రాజకీయంగా అణగదొక్కాలని కుట్రలతో పన్నిన పన్నాగంలో ప్రజాస్వామ్యంలో న్యాయమే గెలిచిందని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు ఎం సుధాకర్ బాబు ఈరోజు పార్టీ కార్యాలయంలో జరిగిన రాహుల్ గాంధీ పై సుప్రీం తీర్పు హర్షనీయమని పార్టీ సంబరాల కార్యక్రమంలో పాల్గొని మిఠాయిలు పంచి కార్యకర్తలతో సంబరాలు జరుపుకున్నారు.సుధాకర్ బాబు మాట్లాడుతూ గతంలో కర్ణాటక రాష్ట్రంలో కోలార్ లో జిల్లాలో జరిగిన కాంగ్రెస్ ఎన్నికల ప్రచారంలో మోదీలు ఉన్న పేరుతో లలిత్ మోడీ నీరవ్ మోడీ లు ఆర్థిక నేరాలు చేసి దేశం నుంచి పారిపోయిన వారి గురించి ఉద్దేశించి రాహుల్ గాంధీ మాట్లాడగా ప్రధానమంత్రి రాజకీయ కక్షతో గుజరాత్ రాష్ట్రం సూరత్ కోర్టులో మోడీ పేరుతో ఉన్న వ్యక్తితో పిటిషన్లు వేయించి రెండు సంవత్సరాల శిక్ష రాహుల్ గాంధీకి విధించిన సంగతి విధితమే ఇలాంటి దుర్మార్గమైన తీర్పులకు చెంపపెట్టుగా

### - రాహుల్ గాంధీని దేశ ప్రజలు ప్రధానిగా కోరుకొనుచున్నారు.
### - సుప్రీం కోర్టు తీర్పు హర్షనీయం..
### - జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు ఎం సుధాకర్ బాబు.

సుప్రీంకోర్టు రాహుల్ గాంధీ శిక్ష పట్ల స్టే విధించడం అనేది ప్రజాస్వామ్య విజయమని ఇప్పుడు జరుగుతున్న పార్లమెంట్ సమావేశాల్లో ఇటువంటి తీర్పు రావడం కాంగ్రెస్ లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయని రాబోవు రోజుల్లో కచ్చితంగా రాహుల్ గాంధీ ప్రధాన మంత్రి అవుతారని తెలియజేశారు.రాహుల్ గాంధీకి ఊరట జైలు శిక్ష అమలుపై స్టే విధించిన సుప్రీంకోర్టు శిక్ష అమలుపై స్టే విధించాలంటూ సుప్రీంను ఆశ్రయించిన కాంగ్రెస్ నేత వాదనలు వినిపించిన అభిషేక్ మను సింఘ్వీ రాహుల్‌పై మోపిన నేరం సమాజానికి వ్యతిరేకం కాదని శుక్రవారం ఈ మేరకు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసిందని.తాను నిర్దోషినని, తనకు విధించిన రెండేళ్ల జైలు శిక్షపై స్టే విధించాలని కోరుతూ సుప్రీంకోర్టును రాహుల్ గాంధీ ఆశ్రయించిన విషయం తెలిసిందే ఈ నేపథ్యంలో జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ పీఎస్ నరసింహా, జస్టిస్ సంజయ్ కుమార్‌తో కూడిన ధర్మాసనం శుక్రవారం విచారణ జరిపిందని ఈ సందర్భంగా రాహుల్ గాంధీ తరపున సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీ వాదనలు వినిపించారని పరువు నష్టం దావా వేసిన ఎమ్మెల్యే పూర్ణేశ్ అసలు ఇంటిపేరు మోదీ కాదని 'మోదీ' పేరును ఆయన తర్వాత పెట్టుకున్నారని ధర్మాసనం దృష్టికి తెచ్చారని. "రాహుల్ నేరస్థుడు కాదు ఆయనపై మోపిన నేరం సమాజానికి వ్యతిరేకం కాదని కిడ్నాప్, హత్య కాదు అని విన్నవించారని ఈ వాదనలు అన్ని విన్న అత్యున్నత న్యాయస్థానం స్టే విధిస్తూ ఉత్తర్వులు జారీ చేయడాన్ని దేశ ప్రజలందరూ కూడా వర్షం వ్యక్తం చేస్తున్నారని అలాగే రాహుల్ గాంధీ పార్లమెంటు సభ్యత్వం పునరుద్ధరించాలని జిల్లా కాంగ్రెస్ పార్టీ తరఫున డిమాండ్ చేస్తున్నామని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో కర్నూలు నగర కాంగ్రెస్ అధ్యక్షులు జాన్ విల్సన్, ఆదోని ఇన్చార్జి దేవిశెట్టి ప్రకాష్ డిసిసి ప్రధాన కార్యదర్శి కె సత్యనారాయణ గుప్త, ఐ ఎన్ టి యు సి జిల్లా అధ్యక్షులు బి బతుకన్న, ఎస్సీ సెల్ జిల్లా చైర్మన్ ఎన్ సి హెచ్ బజారన్న, ఓబీసీ జిల్లా చైర్మన్ ఎం ఖాసిం వలి, కోడుమూరు ఇన్చార్జ్ దామోదరం రాధాకృష్ణ, మైనారిటీ సెల్ సిటీ అధ్యక్షులు షేక్ ఖాజా హుస్సేన్, మహిళా కాంగ్రెస్ సిటీ అధ్యక్షురాలు ఎస్ ప్రమీల, ఎస్సీ సెల్ సిటీ అధ్యక్షులు డబ్ల్యూ సత్యరాజు,డాక్టర్ సెల్ చైర్మన్ అమరేంద్ర రెడ్డి, సేవాదళ్ మహిళా జిల్లా అధ్యక్షురాలు ఏ వెంకట సుజాత, డాక్యుమెంటరీ అసోసియేషన్ చైర్మన్ చంద్ర శేఖర్, కాంగ్రెస్ కార్యదర్శి ఎజాస్ లాజరస్ కాంగ్రెస్ నాయకులు సాంబశివుడు శివానంద్ బి సుబ్రహ్మణ్యం నాగ శేషు విక్టర్ హరి ఐ ఎన్ టి యు సి నాయకులు జేమ్స్ ఆనందం వెంకటేశ్వర్లు బిటి స్వామి మహిళా కాంగ్రెస్ నాయకులు ఎల్లమ్మ కేవీ లక్ష్మి మద్దమ్మ మొదలగు వారు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ చైర్మన్ ను సన్మానించిన ఫర్టిలైజర్స్ షాప్ యజమానులు.

ఎమ్మిగనూరు ఆగష్టు 05 విభారె న్యూస్.ఇటీవల ఎమ్మిగనూరు తాలూకా కాంగ్రెస్ పార్టీ మైనారిటీ సెల్ ఛైర్మెన్ గా ఎన్నికైన సిరాలదొడ్డి ఖాజా ను స్థానిక ఫర్టిలైజర్ అండ్ సీడ్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సత్యారెడ్డి, మహేంద్రబాబు,చంద్రశేఖర్ రెడ్డి, మహేష్,గౌడ్, చంద్ర, వెంకటేశ్వరరెడ్డి ల ఆధ్వర్యంలో శనివారం పట్టణంలోని రిజిస్టర్ కార్యాలయం వెనుక భాగంలో ఫ్రెండ్స్ ఆగ్రో ఫర్టిలైజర్స్ డిస్ట్రిబ్యూటర్ ప్రాంతం నందు చైర్మన్ గా ఎన్నికైన ఖాజా ను శాలువా కప్పి పూలమాలలతో ఘనంగా సత్కరించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భవిష్యత్తులో మరింత ఉన్నత పదవులు సాధించాలని కోరారు. కార్యక్రమంలో దుకాణ యజమానులు మానసమల్లి,వీరస్వామి, బద్రి, మధు, మంజునాథ్ మల్లి, వీరారెడ్డి, గోపాల్, లింగన్న, ఈరన్న, ఇక్బాల్, వలి, హనుమంతు గజేంద్ర లు పాల్గొన్నారు.



## 200 మందికి పైగా వివిధ గ్రామాల ప్రజలు బీజేపీలో చేరిక.



ఎమ్మిగనూరు ఆగష్టు 05 విభారె న్యూస్.భారతీయ జనతా పార్టీ చేస్తున అభివృద్ధి పనులకు ఆకర్షితులై వివిధ గ్రామాలకు చెందిన సుమారు 200 మందికి పైగా బిజెపి ఎమ్మిగనూరు నియోజకవర్గ కన్వీనర్ కేఆర్ మురహరి రెడ్డి, ఆధ్వర్యంలో బీజేపీ పార్టీలో చేరారు. ఇందులో ముఖ్యంగా ఎమ్మిగనూరు పట్టణం నుండి 30 కుటుంబాలు, ఎమ్మిగనూరు మండలం నుండి కదివెళ్ళ గ్రామం నుండి 30 కుటుంబాలు, గోనేగండ్ల మండలం పెద్ద మర్రివీడు గ్రామం నుండి 20 కుటుంబాలు, నందవరం మండలం నాగలదిన్నె నుండి ప్రతాప్ రామయ్య శెట్టి,లాంటి ప్రముఖులు కూడా భారతీయ జనతా పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఈసందర్భంగా కన్వీనర్ కేఆర్ మురహరి రెడ్డి, మాట్లాడుతూ భారతీయ జనతా పార్టీకి కార్యకర్తలే బలం అని అన్నారు. భారతీయ జనతా పార్టీకి ప్రజలు అండగా ఉంటే నరేంద్రమోడీ నాయకత్వంలో భారతదేశం మరింత అభివృద్ధి చెందుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు కిరణ్ కుమార్, మండల అధ్యక్షుడు రాముడు,గోనేగండ్ల అధ్యక్షుడు సుధా నాయుడు, బిల్ నారాయణ,జిల్లా ఉపాధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ రహదారిపై నివసిస్తున్న నిర్వాసితులకు ఇండ్ల పట్టాల పంపిణీ.



నంద్యాల మా ప్రతినిధి ఆగస్టు 05 విభారె న్యూస్ :- నంద్యాల పట్టణంలోని నూనెపల్లె జాతీయ రహదారిపై నివసిస్తున్న నిర్వాసితులకు శనివారం నాడు ఇళ్ల పట్టాలను పంపిణీ చేయడం జరిగిందని ఎమ్మెల్యే శిల్పా రవి చంద్ర కిషోర్ రెడ్డి తెలిపారు. శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలుగా ఇల్లు లేక నూనెపల్లె ప్రాంతంలో హైవే పక్కన నివాస గృహాలు చేసుకొని జీవిస్తున్న వారికి అండగా నిలిచి నేడు నంద్యాల ఆర్డీవో శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఇండ్ల పట్టాలను పంపిణీ చేసి వారి కలను నెరవేర్చానని ఎమ్మెల్యే శిల్పా రవి చంద్ర కిషోర్ రెడ్డి , ఎమ్మెల్సీ ఇసాక్ బాషా అన్నారు .ఈ కార్యక్రమంలో దృశ్యకలల డైరెక్టర్ సునీత అమృతరాజు,మాజీ కౌన్సిలర్ అనిల్ అమృతరాజు,వైస్ ఛైర్మెన్ పంశావలి పలువురు వైసీపీ నేతలు పాల్గొన్నారు.

## భక్తులతో కిటకిట లాడిన వాసాపురం శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయం



నంద్యాల మా ప్రతినిధి ఆగస్టు 05 విభారె న్యూస్ :-నంద్యాల జిల్లా రుద్రవరం మండలం వాసాపురం శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం భక్తులతో కిటకిట లాడింది. ఆధిక శ్రావణ మాసం బహుళ పక్షం శనివారము ఉదయము నుంచి క్యూలో నిలబడి శ్రీ లక్ష్మి గోదా సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి. మరియు మహ త్రిపుర సుందర సమేత మానస లింగేశ్వరస్వామి ని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ అధ్యక్షులు సింగితల మదు సుధన్ రెడ్డి. యల్ వి రంగనాయకులు. కోశాధికారి ఇ కె. వి. నరసింహులు తదితరులు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకున్నారు. ఉదయం భక్తులకు అల్పాహారం ఎర్పాటు చేసారు . కమిటీ సభ్యులు మాట్లాడుతూ కె. యమ్ రెడ్డి డెంటల్ కేర్ వారి సహకారంతో భక్తులకు 12-8-2023 వతేది అనగా శనివారం నాడు శ్రీ వాసాపురం వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో ఉచిత దంత వైద్య అవగాహన శిబిరం ఏర్పాటు చేశారని కావున భక్తులు ఉచిత దంత వైద్య శిబిరం లో పాల్గొని తమ నోటి సమస్యలు డాక్టర్ ద్వారా తెలుసు కోవాలని సూచించారు.

## గాయత్రీ దేవాలయమునకు హుండీని విరాళంగా అందజేసిన శ్రీమతి దేవకి చంద్ర కళావతమ్మ



ఎమ్మిగనూరు ఆగష్టు 05 విభారె న్యూస్.స్థానిక శ్రీ గాయత్రీ దేవాలయమునకు శుక్రవారం రోజు శ్రీమతి దేవకీ చంద్ర కళావతమ్మ (కీర్తిశేషులు దేవకి నరసింహారావు) వారి పేరు మీద హుండీని సమర్పించారు. వారి వెంట వారి కుమారుడు దేవకి జనార్ధన్ ఉన్నారు. వారికి వారి కుటుంబ సభ్యులకు గాయత్రి మాత ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని దేవాలయ అర్చకులు ఆశీర్వదించారు.

### సీతా రామాంజనేయ స్వామి దేవాలయంకు హుండీని విరాళంగా అందజేసిన శ్రీమతి దేవకి కళావతమ్మ.



ఎమ్మిగనూరు ఆగష్టు 05 విభారె న్యూస్.స్థానిక మైనార్టీ కాలనీలో ఉన్న శ్రీ సీతారామాంజనేయ స్వామి దేవాలయమునకు శనివారం రోజు శ్రీమతి దేవకి చంద్రకళావతమ్మ (కీర్తిశేషులు దేవకి నరసింహారావు) వారి పేరుపై హుండీని సమర్పించారు. వారి వెంట వారి కుమారుడు దేవకి జనార్ధన్ ఉన్నారు. వారికి వారి కుటుంబ సభ్యులకు శ్రీ సీతా రామాంజనేయ స్వామి వారి ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని దేవాలయం వారు కోరారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2, OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH. PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY, 7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190